ANN తెలుగు

Follow: @ANNTELUGU

06-08-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 214 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మహారాష్ట్రను ఒప్పించండి!

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి.

- గ్రావిటీతో నీటి సరఫరా జరిగితే భారీగా తగ్గనున్న విద్యుత్ భారం.
- త్వరలో ఇరు రాష్ట్రాల అధికారులతో సీడబ్ల్యూసీ కీలక భేటీ
- కేంద్ర మంత్రులతో సీఎం వరుస భేటీలు

02

## కాళేశ్వరం ముడుపుల లెక్క తేల్చండి

- కట్టుకథలతో బురదజల్లడం సరికాదు
- హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు మానాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్.

02

## '100' కాదు ఇక నుంచి '112'

- అత్యవసర సేవలకు ఒకే నెంబర్
- డయల్ 112 సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్
- ఒకే గొడుగు కిందకు పోలీసు, అగ్నిమాపక, వైద్య సేవలు

03

## మెటా మెడలు వంచిన మోదీ సర్కార్!



- క్షమాపణలు చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

02

ASSOCIATE SPONSER

MEDMEAL

DIAMOND PARTNER

ANANTH DIAMONDS

GOLD | DIAMONDS | POLKI

POWERD BY

KAMADHENU INFRA

# ANN MAHAA AWARDS 2026

HEALTH & BUSINESS AWARDS-2026

## HEARTY WELCOME



**Shri. Kolusu Partha Sarathy**
Minister for Housing of Andhra Pradesh



**Shri. Satya Kumar Yadav**
Minister of Health, Family Welfare and Medical Education of Andhra Pradesh



**Shri. Gottipati Ravi Kumar**
Minister of Energy of Andhra Pradesh



**Shri. Kollu Ravindra**
Minister of Mines and Geology of Andhra Pradesh



**Shri. Kandula Durgesh**
Minister for Tourism and Culture Government of Andhra Pradesh



**Shri. Vasamsetti Subhash**
Minister of Labour, Factories, Boilers and Insurance Medical Services of Andhra Pradesh

Date: 9TH AUG, 2026 Time: 5 PM ONWARDS

VENUE: TAJ VIVANTA, MG ROAD, VIJAYAWADA



Invited By
Kandi. Rama Chandra Reddy
CEO, ANN Media Group

EVENT PARTNER
BXO BRANDXO

DIGITAL PARTNER
CreatorBox



ఏఎన్ఎన్ కార్యాలయంలో

# కంది శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు

**హైదరాబాద్:** పేదల పెన్నిధిగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా గుర్తింపు పొందిన ఏఎన్ఎన్ ఛానెల్ మేనేజింగ్ డైరెక్టర్ కంది శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్ ఛానెల్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛానెల్ జీఎం మందడి అరవింద్ రెడ్డి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో , యాంకర్ లక్ష్మీనాగ్ తో పాటు వివిధ విభాగాలకు చెందిన హెడ్స్ క్రాంతి, విజయ, గురు, మధు, సురేందర్, వేణు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో ఏఎన్ఎన్ ఛానెల్ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, నిష్పాక్షిక వార్తలతో విశ్వసనీయ మీడియా సంస్థగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



# మెటా మెడలు వంచిన మోదీ సర్కార్!

- **క్షమాపణలు చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్.**
- **ప్రధాని వీడియోనే సెన్సార్ చేస్తారా?.. వార్నింగ్‌తో వణికిపోయిన ఫేస్‌బుక్.**

**ఢిల్లీ, మహా:** *అంతర్జాతీయ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ) అహంకారాన్ని కేంద్ర ప్రభుత్వం బద్దలుకొట్టింది. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎంతటి గ్లోబల్ కంపెనీకైనా భారత్‌లో నూకలు చెల్లినట్లేనని మోదీ సర్కార్ ఇచ్చిన గట్టి వార్నింగ్‌కు ఆ సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ హడలిపోయారు. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ వీడియోనే తొలగించే సాహసం చేసిన మెటా...భారత ప్రభుత్వ చట్టపరమైన అస్త్రాలకు బెంబేలెత్తి, దిగివచ్చి బేషరతుగా క్షమాపణలు చెప్పడం సర్వత్రా సంచలనంగా మారింది . జూలై 23న నీట్ పేపర్ లీకేజీ వివాదంపై దేశంలోని యువతను, విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించిన ఒక వీడియోను ఫేస్‌బుక్ తన ప్లాట్‌ఫామ్ నుంచి ఏకపక్షంగా తొలగించడంతో ఈ తీవ్ర వివాదం రాజుకుంది. దాదాపు ఐదు గంటల పాటు ఆ వీడియో కనిపించకుండా పోవడంతో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. ఇది కేవలం సాంకేతిక లోపం (టెక్నికల్ గ్లిచ్) వల్లే జరిగిందని మెటా బుకాయించే ప్రయత్నం చేసినప్పటికీ, భారత ప్రభుత్వం మాత్రం దీన్ని అత్యంత సీరియస్‌గా పరిగణించింది. దేశ ప్రధాని సందేశాన్నే సెన్సార్ చేసే హక్కు మీకెవరిచ్చారంటూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ మెటా ప్రతినిధులను తీవ్రస్థాయిలో నిలదీసింది. అదే సమయంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని పార్లమెంటరీ ఐటీ కమిటీ సైతం మెటాకు ముచ్చెమటలు పట్టించింది.కేవలం మూడు రోజుల్లోగా ఈ వ్యవహారంపై మెటా చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ స్వయంగా క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో ఐటీ చట్టం సెక్షన్ 79 కింద మెటాకు ఉన్న 'సేఫ్ హార్బర్' (చట్టపరమైన రక్షణ) హోదాను రద్దు చేస్తామని కేంద్రం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ రక్షణ కవచం తొలగిస్తే.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఏ యూజర్ ఎలాంటి అభ్యంతరకర పోస్ట్ పెట్టినా నేరుగా సంస్థ యాజమాన్యమే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మోదీ ప్రభుత్వం ఇచ్చిన ఈ అల్టిమేటంతో మెటా అధిష్టానం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రభుత్వ ఆగ్రహంతో కంగుతిన్న మెటా గ్లోబల్ అఫైర్స్ చీఫ్ జోయెల్ కప్లాన్ హుటాహుటిన ఢిల్లీ వాలిపోయారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై బేషరతుగా క్షమాపణలు కోరారు. ప్రధాని మోదీ వీడియోను తొలగించడం ద్వారా తాము చేసిన చారిత్రక తప్పిదానికి జుకర్‌బర్గ్ పంపిన వ్యక్తిగత క్షమాపణల సందేశాన్ని ప్రభుత్వానికి అందించారు. కేవలం ప్రధాని వీడియో వ్యవహారమే కాకుండా.. తమ ప్లాట్‌ఫామ్‌లపై డీప్‌ఫేక్, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తి చెందడంపై కూడా జుకర్‌బర్గ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అల్గారిథమ్ లోపాలతో పాటు, కొన్ని నిర్దిష్ట వర్గాలకు చెందిన కంటెంట్‌ను ఉద్దేశపూర్వకంగా బూస్ట్ చేయడానికి డబ్బులు తీసుకున్నామనే వాస్తవాన్ని కూడా మెటా ప్రతినిధులు అంగీకరించక తప్పలేదు. భారత సార్వభౌమాధికారాన్ని, దేశ చట్టాలను ధిక్కరిస్తే ఎంతటి గ్లోబల్ టెక్ కంపెనీ అయినా సరే మూల్యం చెల్లించుకోక తప్పదని మోదీ ప్రభుత్వం తేల్చిచెప్పిన తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన వేదికలు ఏకపక్ష నిర్ణయాలతో చెలగాటమాడితే ఫలితం ఎలా ఉంటుందో ఈ ఉదంతం కళ్లకు కట్టింది.

# అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

**ఆస్తుల వేలం, ప్రత్యేక కోర్టు ఏర్పాటు దిశగా ఏపీ సర్కార్ అడుగులు.**

**అమరావతి, మహా :** అగ్రిగోల్డ్ డిపాజిటర్ల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ సున్నితమైన అంశంపై ఇప్పటికే మూడు దఫాలుగా సమావేశాలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. అగ్రిగోల్డ్ డిపాజిటర్లు నిజమైన బాధితులని, వారికి న్యాయం జరిగేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి భరోసా ఇచ్చారు.

అగ్రిగోల్డ్ సంస్థకు ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 20 వేల ఎకరాల ఆస్తులు ఉన్నాయని, అందులో 6 వేల ఎకరాలకు పైగా భూమిని వేలం వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ఆస్తుల వేలం ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సీఐడీ అధికారులను కోరినట్లు మంత్రి తెలిపారు. గత సమావేశంలోనే అగ్రిగోల్డ్‌కు చెందిన చరాస్తుల విషయమై పోలీసు శాఖకు అవసరమైన స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

ఈ కుంభకోణం స్థాయిని వివరిస్తూ.. అగ్రిగోల్డ్ సంస్థలో సుమారు ఐదు లక్షల మంది ఏజెంట్లుగా పనిచేశారని, ప్రజల నుంచి వారు దాదాపు రూ.6 వేల కోట్ల మేర డిపాజిట్లు సేకరించారని మంత్రి వివరించారు. ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే సుమారు రూ.3 వేల కోట్లు వసూలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. మొత్తం 18 లక్షల 57 వేల 290 మందికి ప్లాట్లు ఇస్తామని నమ్మించి డిపాజిట్లు తీసుకున్నారని, ఈ వ్యవహారంపై మరింత లోతైన పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బాధితులకు పారదర్శకంగా సమాచారం అందించేందుకు అగ్రిగోల్డ్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే, తొమ్మిది రాష్ట్రాల నుంచి ఏజెంట్లు డిపాజిట్లు సేకరించిన నేపథ్యంలో.. ఆయా రాష్ట్రాల్లో బాండ్ల స్వీకరణ కోసం పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేక సెల్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఈ కేసు విచారణను వేగవంతం చేసేందుకు ఆగస్టు 11న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో (సీఎస్) సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15లోపు ఈ కేసుల విచారణ కోసం ఒక ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఆస్తుల వేలానికి సంబంధించిన విధివిధానాలను సైతం త్వరలో ఖరారు చేసి, దశలవారీగా బాధితులకు న్యాయం జరిగేలా అన్ని నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ముడుపుల లెక్క తేల్చండి

- **కట్టుకథలతో బురదజల్లడం సరికాదు**
- **హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు మానాలి**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్.**



**ఢిల్లీ , మహా :** రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని, తెలంగాణ రైతుల నీటి హక్కులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న విమర్శలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే హరీశ్‌రావు తప్పుడు ప్రచారాలకు తెరతీశారని విమర్శించారు. కట్టుకథలు అల్లి బట్టకాల్చి మీద వేసే కుటిల ప్రయత్నాలను తక్షణమే మానుకోవాలని ఆయన గట్టిగా హితవు పలికారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) అజెండాలో కొత్త అంశాలు ఏమీ లేవని, గత 12 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలనే అందులో పొందుపరిచారని ఆయన వివరించారు. గోరంతను కొండంతలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయొద్దని మంత్రి సూచించారు.

ఆ ప్రాజెక్టులన్నీ మీ హయాంలో జరిగినవే..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు, గత ప్రభుత్వంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ముడుపుల లెక్కలను హరీశ్‌రావు ప్రజల ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. పొరుగు రాష్ట్రం చేపట్టిన పోలవరం, పట్టిసీమ, రాయలసీమ ఎత్తిపోతల పథకాల పనులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్న వాస్తవాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆనాడు పదవుల్లో ఉండి పల్లెత్తు మాట మాట్లాడని వారు, ఇప్పుడు నీటి హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఏది ఏమైనప్పటికీ జల వివాదాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో, రాజీలేని పోరాటం చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# మహారాష్ట్రను ఒప్పించండి!



**ఢిల్లీ, మహా :** ప్రాణహిత నదిపై నిర్మించతలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు సంబంధించి మహారాష్ట్ర నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. బ్యారేజీ ఎత్తు పెంచినంత మాత్రాన మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

***ప్రధాని కార్యాలయ చొరవ.. ముంపులో దక్కని వ్యత్యాసం**

ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, అనుమతుల మంజూరు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆ లేఖపై స్పందించిన ప్రధాని కార్యాలయం.. తదుపరి చర్యల నిమిత్తం దానిని జలశక్తి శాఖకు పంపిన విషయాన్ని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరినప్పటికీ.. 148 నుంచి 152 మీటర్ల వరకు బ్యారేజీ ఎత్తు పెంపుపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) చేసిన శాస్త్రీయ అధ్యయనాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ నివేదిక ప్రకారం.. 148 మీటర్ల ఎత్తులో నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపు ప్రాంతంలో పెద్దగా తేడా ఉండబోదని స్పష్టమైనట్లు వివరించారు. ముంపులో 50 శాతం కేవలం నదీ గర్భంలోనే ఉంటుందని కేంద్ర మంత్రికి తెలియజేశారు.

**గ్రావిటీతో విద్యుత్ ఆదా.. ఉమ్మడి ఆదిలాబాద్‌కు వరప్రదాయిని**

ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని, పంపింగ్ అవసరం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదే 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా నీరు తరలించేందుకు ఆస్కారం ఉంటుందని, తద్వారా విద్యుత్ వినియోగ భారం భారీగా తగ్గుతుందని వివరించారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేసి, ఆ రాష్ట్రాన్ని ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీటి వసతి అందుబాటులోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**సానుకూలంగా స్పందించిన కేంద్రం**

ముఖ్యమంత్రి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తమకు లేఖ అందిందని ధ్రువీకరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపు అంశంపై తొలుత కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి.. ఇరు రాష్ట్రాల అధికారులతో చర్చల ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత తెలంగాణ, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రులతో సమగ్ర సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.ఈ కీలక సమావేశంలో రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్యలతో పాటు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసం, దేశ నిర్మాణానికే విద్య

**అమృత వర్సిటీ స్నాతకోత్సవంలో ఎం. వెంకయ్య నాయుడు.**

అమరావతి, మహా. విద్య అనేది కేవలం ఉపాధి పొందడానికి మాత్రమే పరిమితం కాకూడదని, అది విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మరియు దేశ పునర్నిర్మాణానికి బలంగా దోహదపడాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఉద్ఘాటించారు. అమరావతిలో ఘనంగా జరిగిన అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీ నారా లోకేష్‌తో కలిసి ఈ వేడుకలో పాల్గొన్న ఆయన, పట్టభద్రులైన విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

**మాతృభూమికి సేవ చేయండి.. సంస్కారాన్ని మరువకండి**

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లినా, తిరిగి మాతృభూమికి చేరుకుని దేశ పురోగతికి సేవ చేయాలని వెంకయ్య నాయుడు యువతకు పిలుపునిచ్చారు. చదువు కేవలం అక్షర జ్ఞానాన్ని మాత్రమే కాకుండా ఉన్నతమైన సంస్కారాన్ని నేర్పాలని ఆయన ఆకాంక్షించారు. దినచర్యలో భాగంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయంలోపు పనులన్నీ పూర్తి చేసుకునే సత్సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

కుటుంబ వ్యవస్థకు భారతదేశం మూలస్తంభం లాంటిదని, బిజీ జీవితంలోనూ తల్లిదండ్రులతో నాణ్యమైన సమయాన్ని గడపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ప్రపంచ వేదికపై భారత్ అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని, ఒకప్పుడు నలందా, తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాలతో ప్రపంచ దేశాల విద్యార్థులకు విద్యనందించి భారత్ విశ్వ గురువు గా వెలుగొందిందని ఆయన సగర్వంగా ప్రస్తావించారు.

**నా రాజకీయ ప్రస్థానంలో ఒక్క రూపాయి సొంతం ఖర్చు చేయలేదు**

ఈ వేదికగా వెంకయ్య నాయుడు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తి నింపారు."నేను పాఠశాల స్థాయి నుంచే విద్యార్థి నాయకుడిగా పని చేశాను. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ఏకంగా 17 నెలల పాటు జైలు జీవితం గడిపాను. 1983లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో 30 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే గడిపాను. రాజకీయాల్లో ఉండగా నా జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఒకప్పుడు ఏ అటల్ బిహారీ వాజ్‌పేయి పేరునైతే నేను గోడల మీద రాశానో, కాలక్రమంలో అదే వాజ్‌పేయితో కలిసి బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఒకే వేదికపై కూర్చోవడం నా జీవితంలో మరువలేని ఘట్టం.

# పిఠాపురంలో ప్రగతి పరుగులు



- **డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్క్ తో రహదారులకు మహర్దశ!**
- **రూ. 207 కోట్లతో మోడల్ నియోజకవర్గం.**
- **దశాబ్దాల పాలకుల నిర్లక్ష్యానికి చెక్.**
- **రికార్డు స్థాయిలో రహదారుల నిర్మాణం.**
- **గుంతల నరకం నుంచి పిఠాపురానికి శాశ్వత విముక్తి.**

**అమరావతి, మహా:** రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంపై పిఠాపురం నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. పిఠాపురాన్ని దేశంలోనే అత్యుత్తమ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని సార్వత్రిక ఎన్నికల వేళ ఇచ్చిన మాటను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు. దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురై, కనీస మౌలిక వసతులు లేక కునారిల్లిన పల్లెలు ఇప్పుడు సరికొత్త రహదారులతో కళకళలాడుతున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి చిన్న సమస్యను తన సొంత సమస్యగా భావించిన ఉపముఖ్యమంత్రివర్యులు, బడి, గుడి, ఆసుపత్రులను అనుసంధానిస్తూ ఒక అద్భుతమైన రవాణా నెట్‌వర్క్‌ను పిఠాపురంలో ఆవిష్కరించి సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు.

**బరూ. 207 కోట్లతో 307 కిలోమీటర్ల సరికొత్త రహదారుల సామ్రాజ్యం!**

అభివృద్ధికి నిధుల లేమి సాకు కాదని, పాలకుడికి చిత్తశుద్ధి ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చని శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిరూపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల నిధులను ఏకతాటిపైకి తెచ్చి కేవలం రోడ్ల నిర్మాణం కోసమే ఏకంగా రూ. 207 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. దీనిద్వారా 307 కిలోమీటర్ల మేర కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి రికార్డు సృష్టించారు. గడిచిన రెండేళ్ల వ్యవధిలోనే రూ. 100 కోట్ల వ్యయంతో సుమారు 152 కిలోమీటర్ల పొడవైన 611 రోడ్ల నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ఆయన పరిపాలనా దక్షతకు సజీవ నిదర్శనం. ప్రస్తుతం మరో 70కి పైగా రోడ్లు, భారీ వంతెనల పనులు శరవేగంగా పురోగతిలో ఉన్నాయి.

**దశాబ్దాల చీకట్లను చీలుస్తూ మత్స్యకార కాలనీల్లో జిలుగులు**

సముద్రపు అలలతో పోరాడే మత్స్యకారుల జీవితాల్లో పవన్ కళ్యాణ్ శాశ్వత వెలుగులు నింపారు. అలల కోతకు గురై సముద్ర గర్భంలో కలిసిపోయిన మాయాపట్నం మత్స్యకారులకు 13 ఏళ్ల క్రితం ఇళ్లు కట్టించిన గత పాలకులు కనీస వసతులు కల్పించడం గాలికి వదిలేశారు. ఈ దయనీయ పరిస్థితిని గమనించిన ఉపముఖ్యమంత్రివర్యులు రూ. 1.52 కోట్ల నిధులతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి ఆ కాలనీ రూపురేఖలు మార్చేశారు. ఉప్పాడ తీర ప్రాంతంలో జెట్టీకి వెళ్లే బురదమయమైన రహదారిని బాగుచేసి మత్స్యకారులు సరుకు రవాణా చేసుకునేలా గ్రావెల్ రోడ్డు వేశారు. అలాగే 330 మంది నివసించే కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి రూ. 93 లక్షలతో సిమెంట్ రోడ్లు వేసి ప్రధాన రహదారితో అనుసంధానించారు.

**అమరవిల్లిలో రికార్డు స్థాయిలో పునరుద్ధరణ పర్వం**

ప్రకృతి విపత్తుల కారణంగా ధ్వంసమైన రహదారుల పునరుద్ధరణలోనూ పిఠాపురం మోడల్ ఆదర్శంగా నిలుస్తోంది. వరుస తుపాన్లు, భారీ వర్షాల ధాటికి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన యూ.కొత్తపల్లి మండల పరిధిలోని అమరవిల్లిరామన్నపాలెం బీచ్ రోడ్డును శ్రీ పవన్ కళ్యాణ్ గారి చొరవతో కేవలం రూ. 88 లక్షల వ్యయంతో యుద్ధప్రాతిపదికన పునర్నిర్మించారు. ఏళ్ల తరబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడిన సుమారు 2 వేల మందికి ఈ రోడ్డు నిర్మాణంతో అద్భుతమైన ప్రయాణ సౌకర్యం ఏర్పడింది. విశేష ప్రాముఖ్యత కలిగిన బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు సైతం ఈ రహదారితో దశాబ్దాల కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయి.

**ఆంక్షల సంకెళ్లు తెంచి.. సెజ్ విముక్తితో ముమ్మడివారిపాడులో సరికొత్త చరిత్ర***

అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గ్రామాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) పరిధిలో ఉండిపోయి, కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోని ముమ్మడివారిపాడు గ్రామానికి ఆ ఆంక్షల నుంచి విముక్తి కల్పించారు. రూ. 79.70 లక్షలతో అక్కడ శాశ్వత రహదారిని నిర్మించి ఆ గ్రామస్తుల దశాబ్దాల కలను సాకారం చేశారు. మరోవైపు, అంత్యక్రియలకు వెళ్లే సమయంలో ప్రజలు పడుతున్న వేదనను అర్థం చేసుకున్న ఆయన, కొత్తపల్లి గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన శ్మశాన వాటిక రహదారిని రూ. 26.30 లక్షలతో 411 మీటర్ల సీసీ రోడ్డుగా నిర్మించి 4 వేల మందికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చారు.

**ఏళ్ల నాటి నిరీక్షణకు తెర.. గుంతల నరకం నుంచి పల్లెవాసులకు శాశ్వత విముక్తి**

గత ప్రభుత్వాల హయాంలో గుంతలమయంగా మారి నరకప్రాయంగా తయారైన రహదారులకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభించింది. ఏడేళ్లుగా అరిగోస పడుతున్న 8 వేల మంది పరిసర గ్రామాల ప్రజల కష్టాలను తీరుస్తూ, యూ.కొత్తపల్లి మండలంలోని కొండెవరం గ్రామ పంచాయతీకి అనుసంధానంగా ఉన్న పిఠాపురంఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్లతో పూర్తి చేయించారు. రెండు దశాబ్దాలుగా పాడైపోయిన గొల్లప్రోలు మండలం వన్నెపూడిజీఎన్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో బాగు చేశారు. 15 ఏళ్ల క్రితం పాడైన గొల్లప్రోలుతాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో బీటీ రోడ్డుగా తీర్చిదిద్దారు. చిత్రాడ ఈబీసీ కాలనీలో రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, విద్యార్థుల భద్రత కోసం పాఠశాలకు రూ. 50 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించారు.

**నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదు.. దేశానికే ఆదర్శంగా పిఠాపురం మోడల్***

అభివృద్ధి పనుల మంజూరుతోనే సరిపెట్టకుండా, వాటి ఆచరణపై ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిరంతర నిఘా ఉంచారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, కాంట్రాక్టర్లు మరియు అధికారుల జవాబుదారీతనం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాల వల్ల నిర్మాణంలో జాప్యం జరిగిన 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్ల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కఠినంగా ఆదేశించారు. నిధుల మంజూరు, పనుల పర్యవేక్షణ, నాణ్యతలో రాజీలేని ఈ విధానమే నేడు పిఠాపురాన్ని దేశానికే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా నిలబెడుతోంది.



**అన్నదాతకు అగ్రతాంబూలం.. పల్లెపండుగ 2.0తో వ్యవసాయ క్షేత్రాలకు రాజమార్గాలు**

'పల్లెపండుగ 2.0' కార్యక్రమం ద్వారా రైతుల కష్టాలను తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఇందులో భాగంగా వ్యవసాయ పొలాల మధ్య డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. రైతులు పండించిన తమ విలువైన సరుకును మార్కెట్లకు సులువుగా రవాణా చేసుకునేందుకు వీలుగా.. పి.రాయవరం, బి.ప్రత్తిపాడు పుంత గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి ఏకంగా మూడు కిలోమీటర్ల మేర నాణ్యమైన గ్రావెల్ రోడ్లు నిర్మించారు. ఈ సరికొత్త రవాణా మార్గాల ద్వారా సుమారు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సాఫీగా వెళ్లి వచ్చే అత్యుత్తమ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.




## పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

**బీఆర్ఎస్ యువ నాయకుడు రాజు పటేల్**

**వరంగల్, మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని 12 డివిజన్ పరిధిలోని దేశాయిపేట లో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు రాజు పటేల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు పటేల్ మాట్లాడుతూ, ప్రజా సేవకులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందని, నన్నపునేని నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంజీవ్, అంకత్ రవి, సాగర్ గౌడ్, భారత్ రవి, ఇట్యాల కుమారస్వామి, జూలూరు నాగరాజ్, రాజన్ బాబు, సందీప్ పటేల్, శివ, రాయుడు, శ్రీకాంత్, ప్రశాంత్, భాను తదితర పార్టీ నాయకులు, యువత తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెప్మా సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి

**జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**



**వరంగల్, కార్పొరేషన్ మహా ;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, జీవనోపాధి కార్యక్రమాలను వేగవంతంగా, సమర్థవంతంగా అమలు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న అధికారులను ఆదేశించారు.బుధవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మెప్మా కార్యకలాపాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త మహిళా సంఘాల ఏర్పాటు, బ్యాంకు రుణాల విస్తరణ, ఇందిరా మహిళా శక్తి యూనిట్ల స్థాపన, మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న క్యాంటీన్లు, వైకుంఠధామాల నిర్వహణ, వీధి వ్యాపారులకు రుణాల మంజూరు, వెండింగ్ జోన్ల ఏర్పాటు తదితర అంశాల పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు.టౌన్ వెండింగ్ కమిటీ సమావేశాన్ని త్వరలో నిర్వహించి వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళా శక్తి కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే పోతననగర్‌లో నిర్మించిన ఆధునిక యాంత్రీకృత ధోబీఘాట్‌ను మహిళా సంఘాలు లేదా రజక సంఘాల ద్వారా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నాలుగు నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనున్న టైలరింగ్ హబ్‌లకు టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, వాటిని వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జీడబ్ల్యూఎంసీ పరిధిలోని అన్ని కమ్యూనిటీ హాళ్ల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులకు సూచించారు.నగరంలో నిర్వహిస్తున్న రెండు పట్టణ నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, హనుమకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భీమారంలో నిర్వహిస్తున్న బెగ్గర్ల పునరావాస కేంద్రం (స్మైల్ సెంటర్) పనితీరును మరింత మెరుగుపర్చాలని సూచించిన కమిషనర్, తాను ఆకస్మికంగా కేంద్రాన్ని సందర్శించి పరిశీలిస్తానన్నారు. రోడ్లపై భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి స్మైల్ సెంటర్‌కు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వరరావు, ఉప కమిషనర్ సమ్మయ్య, డీఎంసీలు రజిత రాణి, రేణుక, పిఎంసీలు రమేష్, వెంకట్, సీఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'బ్లాస్ట్ కాదు.. వేస్ట్'.

**విజయ్ సర్కార్ తొలి బడ్జెట్‌పై ఎం.కె. స్టాలిన్ తీవ్ర విమర్శలు.**



**చెన్నై, మహా :** తమిళనాడులో టీవీకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 ఆర్థిక సంవత్సరపు తొలి బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం డీఎంకే తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రజల అంచనాలను ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశపరిచిందని, ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ విమర్శించారు. కొత్త ప్రభుత్వం నుంచి వినూత్నమైన నిర్ణయాలు వస్తాయని ఆశించిన ప్రజలకు, పాత పథకాలకే కొత్త పేర్లు మార్చి చూపించడం తప్ప కొత్తదనం ఏమీ లేదని ఆయన ఆరోపించారు.

**'ద్రవిడ మోడల్' బడ్జెట్‌కు రీమేక్ మాత్రమే!**

నూతన బడ్జెట్‌పై సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించిన ఎం.కె. స్టాలిన్, ప్రజలు గొప్ప మార్పును ఆశించి దీన్ని 'బ్లాస్ట్' బడ్జెట్ అనుకుంటే, చివరకు ఇది ఒక 'వేస్ట్' బడ్జెట్‌గా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. గతంలో డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ద్రవిడ మోడల్' బడ్జెట్‌ను రీమేక్ చేయడం తప్ప, ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూర్చే ఏ ఒక్క కొత్త కార్యక్రమం ఇందులో కనిపించడం లేదని స్పష్టం చేశారు.

**మరుగున పడ్డ కీలక ఎన్నికల హామీలు**

ఎన్నికల సమయంలో టీవీకే ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను బడ్జెట్‌లో పూర్తిగా పక్కన పెట్టారని డీఎంకే నాయకత్వం దుయ్యబట్టింది. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతకు రూ.4,000 భృతి, ఏడాదికి ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతుల పంట రుణాల పూర్తి మాఫీ వంటి ప్రాధాన్య అంశాలపై బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత లేదా నిధుల కేటాయింపులు లేవని విమర్శించారు. రైతాంగ సమస్యలు, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ వంటి ప్రజా సమస్యలకు కూడా బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం కల్పించలేకపోయారని పేర్కొన్నారు.

**పథకాల పేర్లు మార్చడమే నవ పాలనా? – ఉదయనిధి స్టాలిన్**

మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే అగ్రనేత ఉదయనిధి స్టాలిన్ సైతం ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత డీఎంకే ప్రభుత్వ కాలంలో విజయవంతంగా అమలు చేసిన సంక్షేమ పథకాల పేర్లను మార్చి టీవీకే ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం కొత్త కార్యక్రమాలను రూపకల్పన చేయకుండా, పాత పథకాలకే కొత్త రంగులు అద్దే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

**అసెంబ్లీ వేదికగా గట్టిగా నిలదీస్తాం**

బడ్జెట్ సమావేశాలకు ముందు ప్రతిపక్ష స్వరాలను నొక్కేందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే తనపై కక్షసాధింపు చర్యలకు దిగి ఇటీవల అరెస్టు చేశారని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి వ్యూహాలు అనుసరిస్తోందన్నారు. ప్రభుత్వం నెరవేర్చని ప్రతీ ఎన్నికల హామీపై రాబోయే శాసనసభ సమావేశాల్లో డీఎంకే గట్టిగా నిలదీస్తుందని హెచ్చరించారు. డీఎంకే అగ్రనేతల తీవ్ర వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

## '100' కాదు ఇక నుంచి '112'

- అత్యవసర సేవలకు ఒకే నెంబర్
- డయల్ 112 సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్
- ఒకే గొడుగు కిందకు పోలీసు, అగ్నిమాపక, వైద్య సేవలు




**హైదరాబాద్, మహా :** తెలంగాణలో అన్ని అత్యవసర సేవల కోసం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ డయల్ 112 సేవలను అధికారికంగా ప్రారంభించారు. 100 పోలీస్, 101 అగ్నిమాపక, 108 వైద్య సేవలను ఒకే గొడుగు కింద 112 ద్వారా అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 112కు బాధితులు ఫోన్ చేయగా వారి పరిష్కారానికి సిబ్బంది మానిటరింగ్ చేస్తోంది. అత్యవసర సమయాల్లో, ఆపద కాలంలో అండగా ఉండేందుకు 112 సేవలను, ఏఐ ఆధారిత కాల్ సిస్టమ్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో 34 నిమిషాల్లో స్పందించగా ఇక నుంచి 2 నిమిషాల్లోనే రియల్ టైమ్ రెస్పాన్స్ ఇస్తుంది. ఈ కార్యక్రమంలో డీజీలు విక్రమ్ సింగ్ మాన్, శ్రీనివాస్, కమల్ హాసన్ రెడ్డి, సీపి రమేష్ రెడ్డి, సుమతి, సజ్జనార్, జాయింట్ సీపీ గజరావ్ బోపాల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ సికా గోయల్, సీఐడీ చీఫ్ చారు సిన్హా పాల్గొన్నారు.

**112 కాల్‌తో మొత్తం 18 సేవలు**

112కు సంబంధించి విజయవంతంగా పరీక్షలన్నీ పూర్తి చేసి బుధవారం ప్రారంభించారు. పోలీస్, మెడికల్, ఫైర్, విమెన్ సమస్యలు, హైడ్రా కోసం 112 లో యాడ్ చేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఎలక్ట్రిసిటీ, జీహెచ్ఎంసీ లాంటి 18 సేవలు 112కు డయల్ చేస్తే ఫాల్ అప్ చేస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, సకాలంలో సేవలు అందేలా పోలీసులు చూస్తున్నారు. అంతేకాదు ఎన్ఆర్ఐ డెస్క్ కూడా అందుబాటులోకి తెచ్చి వారి సమస్యలు 112కు కాల్ చేస్తే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు..112కి ఓ కాలర్ లైవ్ కాల్ చేసి గొడవలు అల్లర్లు జరుగుతున్నాయని చెప్పగా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు ఫాల్ అప్ చేశారు. సకాలంలో స్పందించినందుకు కాలర్ హర్షం వ్యక్తం చేశారు.

"ఢిల్లీలో నిర్భయ ఘటన తర్వాత కేంద్రం నిధులు కేటాయించి సుప్రీం జడ్జి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. విదేశాల్లో అన్నిఅత్యవసర సేవలకు ఒకే నంబర్ ఉంటుందని, అదే మాదిరిగా మనదేశంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిటీ సూచించింది. భారత్‌లో 112 ప్రామాణిక నంబర్‌గా ఉండాలని ప్రతిపాదించింది. మనదేశంలో ఫైర్, మెడికల్, పోలీస్ సేవల కోసం ఇన్ని నంబర్లు ఉంటే ప్రజలు గుర్తించుకోవడం చాలా కష్టమని సూచించింది. ఈ నేపథ్యంలోనే డయల్ 112 సేవలను ప్రారంభించడం జరిగింది. నేరనియంత్రణకు ఇది చాలా ఉపయోగపడుతుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

**కృత్రిమ మేధ ఆధారిత 112 సేవలు**

ప్రస్తుత టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కృత్రిమ మేధ ఆధారిత 112 సేవలు అందుబాటులో తెచ్చింది. 100,112కు కాల్ చేసిన వెంటనే ఆపరేటర్ కాల్ లిఫ్ట్ చేసి లైవ్ లోనే వెంటనే స్పందించి సంబంధిత శాఖలకు బదిలీ చేస్తున్నారు. దేశంలోనే తొలిసారి ఏఐ, మానవ వనరుల ఆధారిత 112 సేవలు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

**అనేక సమస్యలకు డయల్ 112 పరిష్కారం**

కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్ బీలో రెండు ఫ్లోర్లను డయల్ 112కి కేటాయించామని సీవీ ఆనంద్ తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జీవీకే వారి సాయంతో ప్రారంభించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రం సూచించింది. దీంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ రావడంతో ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా మారాయని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. న్యాయ, వైద్య, సైబర్ సాయం అనేక సమస్య పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గం అయింది.

అంతేకాకుండా డయల్ 112 కాల్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ టూల్స్ వాడుతున్నట్లు తెలిపారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టాన్ని త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగించనున్నట్లు అన్నారు. అలాగే డ్రోన్ టీమ్‌ని సైతం ఫామ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను తీసుకువస్తున్నారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుంది. యువ ఐపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయనున్నట్లు సీవీ ఆనంద్ తెలిపారు.

## కమలనాథుల ఐక్యతా రాగం

- బండి సంజయ్ ఇంట సందడి చేసిన ఈటల, లక్ష్మణ్.
- తెలంగాణ బీజేపీలో ఆసక్తికర పరిణామం.
- అధిష్టానం చొరవతో సమసిపోతున్న విభేధాలు.



**హైదరాబాద్, మహా :** తెలంగాణ భారతీయ జనతా పార్టీలో అత్యంత ఆసక్తికర, సానుకూల పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర నాయకత్వంలో కీలక స్తంభాలుగా భావించే అగ్రనేతలు తమ మధ్య ఉన్న మనస్పర్థలను పక్కనపెట్టి ఆత్మీయంగా కలుసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు సమావేశమయ్యారు. బండి సంజయ్ ఇచ్చిన ప్రత్యేక విందుకు హాజరైన ఈ నేతలు లంచ్ చేస్తూనే తాజా రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా మంతనాలు జరిపారు.

ఈ ఆత్మీయ కలయికకు సంబంధించిన ఫోటోలను బండి సంజయ్ తన అధికారిక సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "మంచి సంభాషణలు ఎప్పుడూ కొత్త ఆలోచనలకు దారి తీస్తాయి" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. గత కొంతకాలంగా బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందని, ఇరువురి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో విస్తృతంగా జరిగింది. ఇలాంటి ప్రతికూల తరుణంలో వీరంతా ఒకేచోట చేరి నవ్వులు చిందిస్తూ విందులో పాల్గొనడం టీబీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని, సంతోషాన్ని నింపింది.

తెలంగాణలో ఎలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవాలన్న కృతనిశ్చయంతో ఉన్న బీజేపీ అధిష్టానం.. పార్టీ ఎదుగుదలకు సంస్థాగతంగా ఉన్న అడ్డంకులను తొలగించే పనికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా బలమైన మాస్ ఇమేజ్ ఉన్న బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య ఉన్న గ్యాప్ పార్టీకి తీవ్ర నష్టం చేకూరుస్తోందని జాతీయ నాయకత్వం గ్రహించింది. చాపకింద నీరులా విస్తరిస్తున్న వీరి విభేదాలకు చెక్ పెట్టి, రాష్ట్రంలో అగ్రనేతలందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాలని వ్యూహరచన చేసింది.

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ గత నెలలో స్వయంగా రంగంలోకి దిగి ట్రబుల్ షూటర్ పాత్ర పోషించారు. హైదరాబాద్‌లోని ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా బండి సంజయ్, ఈటల రాజేందర్‌లతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎడమొహం, పెడమొహంగా ఉన్న నేతలిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కలిసి పనిచేయాలని, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని వారికి దిశానిర్దేశం చేశారు. ఆ సమావేశంలో అధిష్టానం దూత సమక్షంలోనే నేతలిద్దరూ ఆత్మీయ ఆలింగనం చేసుకొని మనస్పర్థలు వీడారు. ఆ భేటీ జరిగి నెల రోజులు కూడా గడవకముందే, ఇప్పుడు ఢిల్లీలో మరోసారి ఈ సీనియర్ నేతలంతా కలుసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపుతోంది.

## పేదలకు అన్యాయం జరగనివ్వం!

- కొత్తగా ఒక్క సెంటునూ నిషేధిత జాబితాలో చేర్చలేదు.
- ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలి.
- దరఖాస్తులను 45 రోజుల్లోగా పరిష్కరించాలి.
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.



**అక్రమ రిజిస్ట్రేషన్లపై అప్రమత్తంగా ఉండాలి**

ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ యంత్రాంగం ప్రథమ బాధ్యత అని మంత్రి ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే సర్వాధికారాలు జిల్లా కలెక్టర్లకు ఉన్నాయని గుర్తుచేస్తూ.. ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు, ఈ రెండింటినీ సమతుల్యం చేస్తూ అత్యంత పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు.

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో 22ఏ (నిషేధిత) జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ ఒక్క పేదవాడికీ, నిజమైన భూహక్కుదారుడికీ ఎలాంటి అన్యాయం జరగకుండా చూడటమే తమ ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే, మరోవైపు ప్రభుత్వ భూములను పరిరక్షించడం అనే రెండు ప్రధాన ఆశయాలతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన వివరించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి పత్రికలు, వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**కొత్తగా ఒక్క సెంటు భూమినీ చేర్చలేదు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఉద్దేశపూర్వకంగా కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని స్పష్టం చేశారు. వివాదాలు లేని ప్రైవేట్ భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చిందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన కొట్టిపారేశారు. ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనప్పటికీ, ఇక్కడ జారీ చేసిన ఆదేశాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని మంత్రి గట్టిగా ఆదేశించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఆ గడువులోగానే దరఖాస్తుల పరిష్కారం**

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని, అదే స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో పనిచేయాలని మంత్రి అధికారులకు ఉద్బోధించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ఎంత ముఖ్యమో, ప్రభుత్వ భూములను కాపాడటం కూడా అంతే కీలకమైన బాధ్యత అని గుర్తుచేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా లోతుగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్.. ఇలా ఏ స్థాయిలో దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినా వాటిని పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రజావాణి కార్యక్రమంలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.



## విద్యార్థి నిరసనకారులకు రాహుల్ గాంధీ మద్దతు

- బెదిరింపులకు భయపడొద్దు.
- క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు.

**ఢిల్లీ, మహా :** ఇటీవల విద్యార్థుల నిరసనల నేపథ్యంలో వివాదంలో నిలిచిన విద్యార్థి ఉద్యమకారులకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. ఢిల్లీలోని తన నివాసం 10 జన్‌పథ్ వద్ద విద్యార్థి నిరసనకారులతో సమావేశమైన ఆయన, వారిని "రాజ్యాంగ సంరక్షకులు"గా అభివర్ణించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు యువత గళం విప్పడం నేరం కాదన్నారు. లోపభూయిష్టమైన వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రశ్నించడం ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినప్పటికీ వారిపై లాఠీచార్జీలు, బెదిరింపులు, కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని విమర్శించారు.ప్రధానిపై వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఓ బాలిక క్షమాపణ చెప్పిన ఘటనపై స్పందించిన రాహుల్, విద్యార్థులను భయపెట్టి క్షమాపణలు చెప్పించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులపై ఒత్తిడి తేవడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు.విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, పరీక్షా పత్రాల లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని, యువతకు భరోసా కల్పించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పాల్గొన్న విద్యార్థి కార్యకర్త రియా అహిర్ మాట్లాడుతూ, ముంబైలో పోలీసు వ్యాన్‌ను అడ్డుకున్న ఘటన తర్వాత తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థులను అక్రమంగా నిర్బంధించకుండా అడ్డుకోవడమే తాను చేసిన పని అని, అయినప్పటికీ తనను వేధిస్తున్నారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలిపారు.మరో విద్యార్థి నిరసనకారిణి ఫరానాజ్ మాట్లాడుతూ, జులై 20న జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపించారు. తమను అదుపులోకి తీసుకుని దేశద్రోహులుగా ముద్రవేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా ప్రజాస్వామ్య హక్కుల కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.



# బెంబేలెత్తిస్తున్న బట్టతల మహమ్మారి



- **ప్రపంచవ్యాప్తంగా రాలిపోతున్న కేశాలు.**
- **అగ్రస్థానంలో చెకియా, స్పెయిన్. వణుకుతున్న అగ్రరాజ్యాలు.**

**హైదరాబాద్, మహా :** జుట్టు.. మనిషి అందానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక. కానీ ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో ఆ జుట్టు రాలిపోవడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మగవారిని కలవరపెడుతున్న అతిపెద్ద సమస్య. ఒకప్పుడు వయసు పైబడిన వారికే పరిమితమైన బట్టతల, నేడు వయసుతో సంబంధం లేకుండా యువతను సైతం వెక్కిరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఎంతమంది మగవారు బట్టతలతో బాధపడుతున్నారనే అంశంపై 'వరల్డ్ పాపులేషన్ రివ్యూ' , 'సూపర్ హెయిర్ పీసెస్' విడుదల చేసిన తాజా గణాంకాలు విస్మయపరుస్తున్నాయి. ఈ సంచలన నివేదికను నిశితంగా పరిశీలిస్తే, పాశ్చాత్య దేశాల్లో బట్టతల అనేది ఒక సామాన్య విషయంగా మారిపోయిందని, అక్కడి మగవారిలో దాదాపు సగం మంది ఈ సమస్యతోనే జీవిస్తున్నారని స్పష్టమవుతోంది. ఇది కేవలం ఒక సౌందర్య సమస్య మాత్రమే కాదని, మారుతున్న మానవ జీవనశైలికి పడుతున్న చేదు ప్రతిబింబమని ఈ గణాంకాలు ఘంటాపథంగా చెబుతున్నాయి.

బట్టతల బాధితుల జాబితాలో ఐరోపా దేశాలు అగ్రస్థానంలో నిలిచి ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. ముఖ్యంగా చెకియా దేశం 42.8 శాతంతో ప్రపంచంలోనే అత్యధిక బట్టతలలు ఉన్న దేశంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాతి స్థానంలో స్పెయిన్ 42.6 శాతంతో సరిగ్గా చెకియాకు చేరువలో నిలిచి భయపెడుతోంది. ఇక ఐరోపా ఆర్థిక దిగ్గజం జర్మనీ సైతం 41.2 శాతంతో మూడవ స్థానంలో నిలిచి బెంబేలెత్తిస్తోంది. అంటే ఈ దేశాల్లో ప్రతి 10 మంది మగవారిలో నలుగురికి పైగా బట్టతలతోనే దర్శనమిస్తున్నారు. ఇదొక కేవలం జన్యుపరమైన సమస్య మాత్రమే కాదని, అక్కడి వాతావరణ పరిస్థితులు, జంక్ ఫుడ్ ఆధారిత ఆహారపు అలవాట్లు, విపరీతమైన మానసిక ఒత్తిడి కూడా మగవారి కేశాలను అత్యంత దారుణంగా హరించివేస్తున్నాయని ఈ గణాంకాల విశ్లేషణ స్పష్టం చేస్తోంది.

యూరప్ తో పాటు అగ్రరాజ్యాల పరిస్థితి కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఇటలీ దేశాలు సరిగ్గా 39.2 శాతం బట్టతల జనాభాతో ఒకే స్థాయిలో నిలిచాయి. నెదర్లాండ్స్, పోలాండ్ దేశాలు కూడా 38 శాతానికి పైగా బట్టతల బాధితులతో సతమతమవుతున్నాయి. ఇక ప్రపంచ పెద్దన్న అమెరికా సైతం 37.9 శాతంతో ఈ జాబితాలో ప్రముఖంగా నిలిచింది. కెనడా, బెల్జియం, స్విట్జర్లాండ్, రష్యా, ఆస్ట్రేలియా, స్వీడన్ దేశాలు 32 నుంచి 36 శాతం మధ్య ఉండి జుట్టు రాలే సమస్య ఆయా దేశాల్లో ఎంత తీవ్రంగా ఉందో చాటిచెబుతున్నాయి. పాశ్చాత్య జీవనశైలి, రసాయనాలతో కూడిన ప్రాసెస్డ్ ఫుడ్ విపరీతమైన వినియోగం , వాతావరణ కాలుష్యం మగవారి ఆత్మవిశ్వాసాన్ని ఏ స్థాయిలో దెబ్బతీస్తున్నాయో ఈ అగ్రరాజ్యాల గణాంకాలు నిరూపిస్తున్నాయి.

గ్రీస్, నార్వే, ఆస్ట్రియా, డెన్మార్క్, పోర్చుగల్, ఐర్లాండ్, ఫిన్లాండ్, న్యూజిలాండ్ దేశాల్లో బట్టతల శాతం 28నుంచి 32 శాతం వరకు నమోదైంది. అయితే, పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఆసియా , లాటిన్ అమెరికా దేశాల్లో బట్టతల సమస్య కాస్త తక్కువగా ఉండటం విశేషం. మెక్సికోలో 28.3 శాతం నమోదు కాగా, ఈ జాబితాలో అత్యంత తక్కువగా ఆసియా దిగ్గజం జపాన్‌లో కేవలం 26.8 శాతం మంది మాత్రమే బట్టతలతో ఉన్నారు. జపనీయుల సంప్రదాయక ఆహారపు అలవాట్లు, సముద్ర ఉత్పత్తుల వినియోగం, మరియు జన్యుపరమైన బలమైన అంశాలు వారిని ఈ బట్టతల మహమ్మారి నుంచి పెద్ద ఎత్తున కాపాడుతున్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మొత్తం మీద ఒక కఠోర సత్యం కళ్ళముందు కదులుతుంది. జుట్టు రాలడం అనేది కేవలం ఒక వ్యక్తిగత సౌందర్య సమస్యగా మాత్రమే మిగిలిపోలేదు, ఇదొక అంతర్జాతీయ సామాజిక , ఆరోగ్య పరిణామంగా మారుతోంది. వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, నిద్రలేమి మానవ శరీర నిర్మాణంలో ఎలాంటి భయంకరమైన మార్పులు తెస్తున్నాయో ఈ బట్టతలల సునామీ స్పష్టం చేస్తోంది. రాబోయే దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా మగవారి సౌందర్య ప్రమాణాలు రూపురేఖలు కోల్పోవడం ఖాయమని ఈ సంచలన గణాంకాలు ప్రపంచం ముందు ఉంచుతున్న చేదు నిజం!







# వర్షాకాలంలో జీర్ణ సమస్యలు ఎందుకు పెరుగుతాయి?

మన శరీరంలోని రోగనిరోధక శక్తిలో దాదాపు 70 నుంచి 80 శాతం వరకు జీర్ణవ్యవస్థతోనే ముడిపడి ఉంటుంది. పేగులు ఆరోగ్యంగా ఉంటే శరీరం వ్యాధులను సమర్థంగా ఎదుర్కోగలదు. పేగుల్లో ఉండే మంచి సూక్ష్మజీవులు హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడతాయి. అయితే సరైన నిద్ర లేకపోవడం, అధిక మానసిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం లేదా అవసరానికి మించి యాంటీబయాటిక్ మందులు వాడడం వల్ల పేగుల్లోని మంచి సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతింటుంది. దీంతో పేగుల పనితీరు బలహీనపడి ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కొనే సామర్థ్యం తగ్గిపోతుంది.

వర్షాకాలంలో జీర్ణక్రియ సహజంగానే కొంత మందగిస్తుంది. దీంతో ఈ కాలంలో చాలా మందికి కడుపు ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం, విరేచనాలు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా చిరాకు ◌గు వ్యాధితో బాధపడేవారిలో ఈ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. వర్షాకాలం నేరుగా ఈ వ్యాధికి కారణం కాకపోయినా, ఈ కాలంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లలో వచ్చే మార్పులు సమస్యను మరింత పెంచుతాయి.చిరాకు పేగు వ్యాధి అనేది జీర్ణవ్యవస్థకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్య. ఇందులో మెదడు, పేగుల మధ్య ఉండే అనుసంధానం అత్యంత సున్నితంగా మారుతుంది. అందువల్ల చిన్న చిన్న మార్పులకే జీర్ణవ్యవస్థ తీవ్రంగా స్పందిస్తుంది. వర్షాకాలంలో ఈ సమస్య ఎందుకు ఎక్కువ అవుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను యశోద ఆస్పత్రుల సీనియర్ జీర్ణవ్యవస్థ నిపుణుడు డాక్టర్ డి. చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

తగినంత నీరు తాగకపోవడం కూడా ప్రధాన కారణాల్లో ఒకటి. వర్షాకాలంలో దాహం తక్కువగా అనిపించడంతో చాలామంది నీరు తక్కువగా తాగుతారు. దీని వల్ల స్వల్ప స్థాయిలో నీటి కొరత ఏర్పడి మలబద్ధకం, కడుపు ఉబ్బరం, జీర్ణక్రియ మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయి.ఈ కాలంలో ఆహారపు అలవాట్లు కూడా మారిపోతాయి. నూనెలో వేయించిన పదార్థాలు, టీ, కాఫీ, బయట తయారయ్యే ఆహారం ఎక్కువగా తీసుకోవడం, పండ్లు, పీచుపదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తగ్గించడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు లేదా మలబద్ధకం వచ్చే అవకాశం పెరుగుతుంది. వర్షాకాలంలో నీరు, ఆహారం సులభంగా కలుషితమవుతాయి. దీంతో వైరస్‌ల వల్ల వచ్చే కడుపు ఇన్‌ఫెక్షన్లు, ఆహార విషబాధ, బ్యాక్టీరియా సంబంధిత వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. ఇన్‌ఫెక్షన్ తగ్గిన తర్వాత కూడా పేగులు కొంతకాలం సున్నితంగా ఉండటం వల్ల లక్షణాలు కొనసాగవచ్చు.

అలాగే సమయానికి భోజనం చేయకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం, అధిక మానసిక ఒత్తిడికి గురికావడం వంటి జీవనశైలి అలవాట్లు కూడా మెదడు-పేగుల అనుసంధానాన్ని ప్రభావితం చేసి జీర్ణ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి.





## దారి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**పాలకుర్తి, మహా:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి, మక్కన్ సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ బసంత్‌నగర్‌లోని ప్రసిద్ధ దారి మైసమ్మ ఆలయన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.



## తల్లి పాలే శ్రేష్టం

- **45వ వార్డులో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం**
- **తల్లులకు మున్సిపల్ చైర్ పర్సన్ అవగాహన**

**ఆదిలాబాద్ మహా:** తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం అదిలాబాద్ పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ లో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. చిన్నారులు, గర్భిణీలు బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. తల్లిపాల ద్వారా పిల్లల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, శారీరక మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు.అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు, మల్టీ విటమిన్‌లతో కూడిన పోషకాహార పదార్థాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ పోషకాహారం పిల్లల ఎదుగుదలకు, రక్తహీనత నివారణకు, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు నిర్మాణానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి తల్లి తన బిడ్డ ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావించి, వైద్యులు అంగన్‌వాడీ సిబ్బంది సూచనలను పాటించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లిశిశు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ అధికారులు సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- సింగరేణి ఉమెన్స్ కాలేజీలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం





**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా-సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం ఎక్కువ జరుగుతున్న డిజిటల్ అరెస్ట్, స్టాక్ బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ లోన్ యాప్ మోసాలు సోషల్ మీడియా మోసాలు ఏపీకే ఫైళ్ల ద్వారా జరిగే సైబర్ నేరాలు మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల వినియోగం వంటి సైబర్ మోసాల గురించి ఉదాహరణలతో విద్యార్థినులకు వివరించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు ఉద్యోగ అవకాశాలు సినిమా అవకాశాలు తక్కువ వడ్డీ రుణాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. అదేవిధంగా సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తూ డిజిటల్ లావాదేవీల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, ఓటిపిలు, కేవైసీ అప్‌డేట్, లోన్‌లు లేదా రివార్డుల పేరుతో వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సకాలంలో ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. అలాగే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీటు బెల్ట్ ధరించాలని అతివేగం నిర్లక్ష్య డ్రైవింగ్ మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు .ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సైబర్ సెల్ సిఐ జితేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సింగరేణి ఎడ్యుకేషన్ జిఎం రాజేంద్రప్రసాద్, కరస్పాండెంట్ కాంతారావు, కళాశాల ప్రిన్సిపాల్ శారద, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సంధ్యారాణి, లెక్చరర్లు, సైబర్ సెల్ పోలీసు అధికారులు, సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

- **ఓటర్ల వివరాల ధృవీకరణకు సహకరించాలి**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. మరణించిన శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన నివాసం మార్చుకున్న(షిఫ్ట్ అయిన) ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)2026 కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు పొడిగించడంతో అదనపు సమయం లభించిందని ఆ సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని మిగిలిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన పురోగతిని వివరిస్తూ మొత్తం 9,96,198 మంది ఓటర్లకు సంబంధించి 8,60,051 ఎన్యూమరేషన్ ఫారాలు(86.33 శాతం) డిజిటైజ్ కాగా, 1,29,263 ఫారాలు(12.98 శాతం) అన్‌కలెక్టబుల్‌గా నమోదయ్యాయని తెలిపారు. దీంతో డిజిటైజ్ చేసిన ఫారాలు, అన్‌కలెక్టబుల్ ఫారాలు కలిపి మొత్తం 9,89,314 ఫారాల ప్రక్రియ పూర్తయి జిల్లా 99.31 శాతం పురోగతి సాధించిందన్నారు. ప్రస్తుతం కేవలం 6,884 ఫారాలు(0.69 శాతం) మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మ్యాపింగ్ పూర్తయిన ఓటర్ల వివరాలు నేరుగా ముసాయిదా(డ్రాఫ్ట్) ఓటరు జాబితాలో చేరుతాయని తెలిపారు. అన్‌మ్యాప్డ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలో మరణించిన వారు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు నివాసాన్ని మార్చుకున్న ఓటర్ల వివరాలను ధృవీకరించి సంబంధిత ఆధారాలతో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఏఎస్‌డీ, డీఎస్ఈ జాబితాలను మరోసారి పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ సేకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగిందో లేదో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించాలని అవసరమైతే రీవెరిఫికేషన్ నిర్వహించి లోపాలను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు.పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ రీఅరేంజ్‌మెంట్ ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. పాత శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలకు బదులుగా కొత్త భవనాలు అందుబాటులో ఉంటే వెంటనే సమాచారం అందించాలని పాఠశాల పేరు లేదా భవనం మారిన సందర్భాల్లో సంబంధిత ప్రతిపాదనలు పంపాలని కోరారు. అలాగే 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు లేదా జనాభా మార్పులు అధికంగా ఉన్న ప్రాంతాలను రేషనలైజేషన్ కోసం ప్రతిపాదించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శనలు నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తుండగా ఆగస్టు 10లోగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు క్లెయిమ్‌లు అభ్యంతరాలపై విచారణ పరిష్కార ప్రక్రియ చేపట్టి అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్, కాంగ్రెస్ పార్టీ శ్రీనివాసరెడ్డి, బిజెపి అండ్ కృష్ణ, శివ, ఆమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, సిపిఐ బాలరాజు ఇతర గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొండాపురం గనిలో ఐఎన్‌టీయూసీ ఫిట్ సమావేశం

- **పీకే ఓసీ–2 డిప్‌సైడ్ గనిని సింగరేణికి కేటాయించడం కార్మికుల విజయమే..**
- **ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు వి కృష్ణంరాజు**
- **మణుగూరులో కొనసాగుతున్న కార్మిక సంబరాలు..**
- **మిఠాయిల పంపిణీ**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియా పీకే ఓసీ-2 డిప్‌సైడ్ గనిని సింగరేణి సంస్థకు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సింగరేణి శాశ్వత కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, మణుగూరు పట్టణ ప్రజల సమిష్టి విజయమని ఐఎన్‌టీయూసీ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు వి కృష్ణంరాజు అన్నారు. కొండాపురం అండర్‌గ్రౌండ్ గనిలో జహీర్ అధ్యక్షతన నిర్వహించిన ఫిట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పీకే ఓసీ-2 డిప్‌సైడ్ గనిని సింగరేణికి కేటాయించిన ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ గనిలో మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ నిర్ణయంతో సింగరేణి సంస్థకు మరో మూడు దశాబ్దాల పాటు భవిష్యత్తు భరోసా లభించిందని, వేలాది కార్మిక కుటుంబాల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయని కృష్ణంరాజు పేర్కొన్నారు. మణుగూరు మనుగడ ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, గనిలో ఉత్పత్తి పూర్తిగా శాశ్వత కార్మికులతోనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం ఐఎన్‌టీయూసీ తన శక్తిమేరకు నిరంతరం పోరాటం చేసిందని, ఈ ఉద్యమానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాలు అందించిన సహకారం అభినందనీయమని తెలిపారు. గత నాలుగేళ్లుగా మణుగూరు మనుగడపై ఐఎన్‌టీయూసీ వ్యక్తం చేసిన ఆందోళనలు ఇప్పుడు నిజమయ్యాయని, ప్రస్తుతం అన్ని వర్గాలు ఐక్యంగా ఉద్యమంలో భాగస్వామ్యం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ విజయం అందరి సమిష్టి కృషి ఫలితమని అన్నారు. ఈ విజయానికి ప్రత్యేక కృషి చేసిన పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీకే ఓసీ-2 డిప్‌సైడ్ గనిని సింగరేణికి కేటాయించే విషయంలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధులకు ఐఎన్‌టీయూసీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. అధికారులు సూచించిన భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ఉత్పత్తిని కొనసాగించాలని, సింగరేణి అభివృద్ధికి ప్రతి కార్మికుడు అంకితభావంతో పనిచేయాలని కృష్ణంరాజు పిలుపునిచ్చారు. సమావేశంలో శాఖ కార్యదర్శి గట్టయ్య యాదవ్, అబ్దుల్ రవూఫ్, డి. సందీప్, పిట్ నాయకులు తాళ్లూరి రాము, రాజాబాబు, యాకూబ్ పాషా, సతీష్, రత్నం, మహేష్, అధికారులు, శాశ్వత కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



## పక్షవాతంతో బాధపడుతున్న కుటుంబానికి చేయూత

- **గురిజాల లక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల పంపిణీ**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపనగుంట గ్రామానికి చెందిన మిడిదొడ్డి రాజారాం కుటుంబానికి గురిజాల లక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రాజారాం కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతుండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ట్రస్ట్ ప్రతినిధులు నేరుగా వారి ఇంటికి వెళ్లి అవసరమైన సరుకులను అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం గురిజాల లక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. సమాజ సేవను బాధ్యతగా భావిస్తూ భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురిజాల వరలక్ష్మి, గురిజాల సందీప్, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, బాడిశ పార్వతి, లక్ష్మి, బానోత్ కిషన్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- **మోసపూరిత లింకులు, ఓటీపీలు పంచుకోవద్దు..**
- **మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి**

**మణుగూరు, మహా :** సైబర్ నేరాల పట్ల మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి సూచించారు. పట్టణంలోని వాసంతి క్రియేషన్స్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన, సీఐ పాటి నాగబాబుతో కలిసి మహిళలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు అధికారులు, కొరియర్ సంస్థల ప్రతినిధులు లేదా పోలీసుల పేరుతో ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు వివరాలు సేకరించి ఖాతాల్లోని నగదును కాజేస్తున్న సంఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. అలాగే ఉద్యోగాలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, బహుమతులు వచ్చాయని నమ్మించి నకిలీ లింకులు పంపించి డబ్బులు మోసం చేసే ఘటనలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు. తెలియని వ్యక్తులు పంపిన లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దని, ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు వస్తే వెంటనే స్పందించకుండా సంబంధిత బ్యాంకు లేదా అధికారులను సంప్రదించాలని చెప్పారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయడం లేదా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించకపోవడం, మైనర్లకు వాహనాలు ఇవ్వకపోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ , వాసంతి క్రియేషన్స్ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియుసి నుండి టీబీజీకేఎస్ లో చేరిక

- **కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి సంస్థ ప్రశ్నార్ధకంగా మారింది**



**మందమర్రి, మహా :** మందమర్రి సివిల్ డిపార్ట్మెంట్ లో విధులు నిర్వహిస్తున్న కొంతమంది ఏఐటియుసికి చెందిన వారు బుధవారం టీబీజీకేఎస్ కండువా కప్పుకున్నారు.ఈ చేరికల కార్యక్రమానికి టీబీజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఓ రాజశేఖర్, స్థానిక ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని ఆరోపించారు. కొత్త గనులు, మెడికల్ అండ్ ఫిట్, కొత్త ఉద్యోగాలు లేక కార్మికులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కార్మికుల సంఖ్య తగ్గిపోకుండా చూసి కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు ప్రమోషన్లు బదిలీలు వంటి సమస్యలు పరిష్కరించడంలో ప్రస్తుత సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి పూర్తిగా విఫలం అయిందని అన్నారు. సింగరేణి సంస్థ వృద్ధిలోకి రావాలి అంటే ఉత్పత్తి ఉత్పాదుకతో పాటు కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని ఆయన వెల్లడించారు. అనంతరం సివిల్ డిస్ట్రిబ్యూషన్ డిపార్ట్మెంట్లో విధులు నిర్వహిస్తున్న గోవిందుల శ్రీనివాస్, ఎండి సమియోద్దీన్, బి రాజయ్య, మాస్ లచ్చన్న, మోతె నరేష్, బండి వెంకటేష్, డి పున్నం, దుర్గం శంకర్, మోత నరేష్, దుర్గం శంకర్ ఎం శివరాజ్ రావుల శ్రీను లను వారు సాదరంగా ఆహ్వానించి కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకటరమణ, బెల్లం అశోక్, కోరబోయిన లక్ష్మణ్, బాబురావు, వీరారెడ్డి, కొండల్ రావు, సిపెల్లి రాజలింగు, కారుకూరి తిరుపతి, ఎండి అబ్బాస్, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పూరి గుడిసెలో ఉన్న పేదలను గుర్తిస్తున్న ఎంపీడీవో

**వలిగొండ ఆగస్టు 5 మహా న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు పూరిగుడిసే లేకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అందుకోసం బుధవారం వలిగొండ మండల కేంద్రంలో ఎంపీడీవో జలంధర్ రెడ్డి పేదల ఇండ్లను పరిశీలించి ఇల్లు లేని పేదల జాబితాను తయారు చేస్తామని ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కిరణ్వలిగొండ పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు



# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 2కే రన్

**భువనగిరి ఆగస్టు 5 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం మత్తుపదార్థాలు మరియు డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో 2K రన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీఎస్పీ రవీందర్ యాదవ్, పట్టణ సీఐ రమేష్, ఎస్ఐ లక్ష్మీ నరసయ్యతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జంగీర్, మాజీ కౌన్సిలర్ ఇరపాక నరసింహ, డీసీసీ కార్యదర్శి మజార్ బాయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత చదువులు అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మత్తు అలవాట్లకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం డీఎస్పీ రవీందర్ యాదవ్, సీఐ రమేష్ కలిసి జెండా ఊపి 2K రన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బట్టు సందీప్, రేగు.రమేష్, సన్నీ, మసూద్, నితీష్ సాయిచరణ్, జలీల్, ఆబేద్ తదితరులు పాల్గొన్నారు.




## కల్తీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**వలిగొండ, ఆగస్టు 5 (మహా న్యూస్):** ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులు, మసాలా దినుసులు, నూనెలు తదితరాల్లో కల్తీ పెరిగి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందన్నారు. కల్తీ ఆహారంతో పాటు డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి అక్రమాలపై కూడా ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వాలను కోరారు. అధికారులు కఠినంగా వ్యవహరించి కల్తీ మాఫియాను పూర్తిగా అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.



## కంది శ్రీనివాస రెడ్డి పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్న కాంగ్రెస్ శ్రేణులు అభిమానులు

- **వృద్ధాశ్రమంలో అన్నదానం పండ్లు స్వీట్స్ పంపిణీ**
- **తంతోలి పాఠశాల విద్యార్థులకు పండ్లు నోట్ బుక్స్ అందజేత**

**ఆదిలాబాద్ మహా :** తమ అభిమాన నేత నిత్యాన్నదాత ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించినట్టు ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతష్ రావు తెలిపారు. బుధవారం భోరజ్ మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆదిలాబాద్ పట్టణంలోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను జరిపారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు స్వీట్లు అందచేసారు. కొన్ని కుటుంబ కారణాల వల్ల తమ కంది శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలుకు దూరంగా అన్నారని తమ అభిమాన నేత పుట్టిన రోజును ఇలా వృద్ధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలోని నిత్యాన్నదాన కేంద్రంలోను పార్టీ శ్రేణులు అన్నదానం చేసారు. అటు స్థానిక శ్రేణులు రిమ్స్ సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రంలో రోగుల సహాయకులకు స్వీట్స్ పంపిణీ చేసారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు నోట్ బుక్స్ పంపిణీ చేసారు.




## పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియపై సమీక్షా సమావేశం

**ఆదిలాబాద్ మహా:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియలో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10న రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి, 17న ముసాయిదా జాబితాను ప్రచురిస్తామన్నారు. 17 నుంచి సెప్టెంబరు 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించి, అక్టోబరు 19న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బిఎల్ఓ, బిఎల్ఏల సమావేశాలు నిర్వహించి, ఆ వివరాలను బిఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ జిల్లావ్యాప్తంగా 99.47 శాతానికి చేరిందని, ఇందులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 99.01 శాతం, బోథ్ పరిధిలో వంద శాతం పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, నకిలీ ఓటర్లు వివరాలతో పాటు కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై వివిధ పార్టీల నేతల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ జగదీశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## తల్లిపాలే శ్రీరామరక్ష

**అవగాహనా ర్యాలీ**
**తల్లి పాల విశిష్టతను వివరించిన కలెక్టర్**

**ఆదిలాబాద్ మహా:** నవజాత శిశువుల ఆరోగ్యం, శారీరక, మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం రిమ్స్ ఆస్పత్రి నుండి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. స్టేడియంలో మెడికల్ కళాశాల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు నాటికలు, పాటల ద్వారా తల్లిపాల విశిష్టతపై ప్రజల్లో చైతన్యం తెచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని స్పష్టం చేశారు. ముర్రు పాలలో ఉండే యాంటీబాడీలు శిశువుకు అవసరమైన రోగనిరోధక శక్తిని అందిస్తాయన్నారు. కొన్ని గిరిజన గ్రామాలు, తండాల్లో తల్లిపాలు సరిగ్గా రాకపోతే ఆవు పాలు, తేనె వంటివి పట్టిస్తున్నారని, దీనివల్ల శిశువులకు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పాలు పడని సమయంలో తల్లిబిడ్డల చర్మానికి చర్మం తగిలేలా చేసే 'కంగారూ మదర్ కేర్' వల్ల ప్రకృతి సిద్ధంగా తల్లిపాలు పడతాయని, రిమ్స్‌లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ విషయంలో తల్లితో పాటు భర్త, అత్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. ఐసీఎంఆర్ 'సంకల్ప్' ప్రోగ్రామ్ ద్వారా నవజాత శిశు మరణాల రేటును తగ్గించగలిగామని, మెదడు వికాసానికి బిడ్డ పుట్టిన మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా వైద్య కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు వెంకట్ రెడ్డి, అశోక్, వైద్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

**మృతుని అవయవాలు దానం చేసిన కుటుంబం**



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామం మూలమలుపు వద్ద ఈ నెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాయం సాయి(20) పొందుతూ బ్రెయిన్ డెడ్ తో బుధవారం మృతి చెందాడు. కారేపల్లి మండలం కోయగుంపుకు చెందిన పాయం సాయి, వజ్జా సురేష్‌లు మోటర్ సైకిల్ పై కారేపల్లి క్రాస్ రోడ్డు నుండి ఇంటికి వస్తున్న క్రమంలో మోటార్ సైకిల్ కింద పడడంతో వజ్జా సురేష్ అక్కడికక్కడే మృతిచెందగా పాయం సాయి కి తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. అతని హైదరాబాద్ తరలించి చికిత్స నిర్వహిస్తుండగా బ్రెయిన్ డెడ్ అయింది. అవయవ దానంపై సొసైటీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు సాయి కుటుంబ సభ్యులను చైతన్యం చేయటంతో వారు తమ కుమారుడు అవయవదానంతో చిరంజీవిగా ఉంటాడని తలచి అవయవ దానం కు ఒప్పుకున్నారు. దీంతో స్టార్ హాస్పిటల్ యశోద హాస్పిటల్ ఉస్మానియా హాస్పిటల్ లోని పేషెంట్లకు అవయవాలను దానం చేశారు. ఈ సందర్భంగా పాయం కుటుంబ సభ్యులను పలువురు కొనియాడారు.

## పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- **అంబేద్కర్ నగర్ లో తనిఖీలు**
- **పలు వాహనాలు అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం**
- **మట్కా ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు.**
- **కాలనీ వాసులకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పలు సూచనలు**



**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ ,నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీ లో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 220 ద్విచక్ర వాహనాలు, 29 ఆటోలు, ఒక కారు, స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న 6 వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల వద్ద 46 క్వార్టర్ బాటిల్స్ 28 చిన్న మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ముగ్గురు మట్కా ప్లేయర్లు షేక్ ఖలీల్, రంజిత్, దినేష్ లు మట్కా ఆడుతున్నట్లు నిర్ధారించి వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసారు. ప్రజలు మత సామరస్యాన్ని కాపాడాలని, విద్వేషాలకు దారితీసేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని ఎస్పీ సూచించారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం, అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని చట్టాన్ని గౌరవించేలా జీవించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత తెలియజేస్తూ కాలనీ మొత్తం కలిసికట్టుగా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పీడి యాక్ట్ నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. డీజే లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. డీజే నిర్వాహకులపై, ఓనర్లపై బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిఐలు రహీం పాషా, కే నాగరాజు, నైలు, చంద్రశేఖర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు నాగనాథ్, వి. విష్ణువర్ధన్, అశోక్, పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారం చూపండి

**మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ లోని డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కేంద్ర మంత్రికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బుధవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీ ఈటెల రాజేందర్ విలేకరులతో మాట్లాడుతూ రోజుకు పదివేల మెట్రిక్ టన్నుల చెత్త ఒకే చోట వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జవహర్ నగర్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలైన కీసర, అహ్మద్ గూడా, నాగారం, ఘట్కేసర్, దమ్మాయిగూడ, మొదలైన ప్రాంత ప్రజలు డంపింగ్ యార్డ్ వల్ల తీవ్రమైన కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, జీరో పొల్యూషన్ తో చెత్త రీసైకిల్ చేపట్టాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి హైదరాబాదులోనూ ఢిల్లీ తరహా వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.




## కనకదుర్గ చిట్‌ఫండ్స్ బాధితులకు భారీ ఊరట

- **93 మంది బాధితులకు రెండు కోట్లకు పైగా విలువ గల చెక్కుల పంపిణీ**
- **ప్రత్యేక బృందాలతో దర్యాప్తు**
- **ఎస్పీకి బాధితుల కృతజ్ఞతలు**

**ఆదిలాబాద్ మహా :** కనకదుర్గ చిట్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టి సంవత్సరాలుగా తమ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 93 మంది బాధితులకు న్యాయం జరిగింది. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవతో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు చెందిన దాదాపు 93 మంది బాధితులకు రావలసిన 2 కోట్ల 34 లక్షల 59 వేల 991 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం కనకదుర్గ చిట్ ఫండ్స్ యాజమాన్యం బాధితులకు చెల్లించాల్సిన డబ్బులను తిరిగి ఇవ్వకపోవడంతో వారి ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు .ఈ కేసుకు సంబంధించి మరికొన్ని ఫిర్యాదులు కూడా నమోదయ్యే అవకాశం ఉందని నిందితుడికి తెలియజేయగా, బాధితులందరికీ చెల్లించాల్సిన మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లించేందుకు అతను అంగీకరించాడు. అందులో భాగంగా ఈ రోజు సబ్ రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో 93 మంది బాధితులకు రావలసిన 2 కోట్ల 34 లక్షల 59 వేల 991 రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రజలు అధిక లాభాల పేరుతో వచ్చే మోసపూరిత పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చట్టబద్ధంగా నమోదు చేయబడిన చిట్ ఫండ్ సంస్థల్లో మాత్రమే పెట్టుబడులు పెట్టాలని తెలిపారు. పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థకు ప్రభుత్వ అనుమతులు, చట్టబద్ధత ఉన్నాయో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని ప్రజలకు సూచించారు. ఏళ్ల తరబడి నిలిచిపోయిన తమ డబ్బులను తిరిగి అందించినందుకు జిల్లా పోలీసు యంత్రాంగానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు, కనకదుర్గ చిట్ ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల తనిఖీ.. సమస్యలపై వినతి

**జూలూరుపాడు, మహా:** పడమట నర్సాపురంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహాన్ని ఐటీడీఓ భారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వసతి గృహానికి ప్రహరీ నిర్మాణం, డే అండ్ నైట్ వాచ్‌మన్, వంట కార్మికుల నియామకం, విద్యార్థినులకు యూనిఫాంలు, దోమతెరల పంపిణీ వెంటనే చేపట్టాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి ,మహా** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లి గ్రామంలో బుధవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్ లో విస్తృతంగా ఇల్లు ఇల్లు పర్యటించారు. గ్రామంలో ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండవ విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆలేరు నియోజకవర్గానికి రెండవ విడతలో అత్యధికంగా ఇళ్ల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. తదుపరి గ్రామ చేనేత సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గౌరాయిపల్లి గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని చెరువులను నీటితో నింపేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని, గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలేరు నియోజకవర్గాన్ని తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఆలేరు నియోజకవర్గానికి ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య గారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## మార్షల్ ఆర్ట్స్‌లో సింగరేణి విద్యార్థిని ప్రతిభ

**భద్రాద్రి కొత్తగూడెం,** మహా: సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థిని భూక్య శ్రీవిద్య హైదరాబాద్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ, రజత పతకాలు సాధించింది. కరాటే కాటా విభాగంలో స్వర్ణం, కుమిటే విభాగంలో రజతం గెలిచి కళాశాల, సింగరేణి సంస్థకు కీర్తి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా సింగరేణి విద్యాసంస్థల అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దిశగా అడుగులు

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద**




**జైపూర్ / మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార ,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జైపూర్ మండలలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రజల కోసం, ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీం చేసిన వీరోచిత పోరాటం చిరస్మరణీయమని, భావితరాలకు చరిత్ర అందించేలా కొమురం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు కొరకు 20 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందని, జైపూర్ మండలంలో కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు కొరకు స్థల కేటాయింపుపై పరిశీలించడం జరుగుతుందని వివరించారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తింప చేయడం జరుగుతుందని, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలో గల పెంకుటిళ్లను పరిశీలించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని పేర్కొన్నారు. చెన్నూర్ మండలంలో దాదాపు 1 వేయి ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని, నిబంధనల ప్రకారం నిర్మించిన ఇండ్లకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సి.సి. రోడ్లు, మురుగు కాలువ వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఆదివాసీ పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని, విద్యకు ఉన్న శక్తి అనిర్వచనీయమైనదని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్య కోర్సులను అందించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని, జర్మన్ భాష నేర్పించి విదేశాలలో గల ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్య మెరుగైన వసతులు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 5 మహా** ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌళిక వసతులు కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. గతంలో పర్యటన సందర్భంగా వచ్చినప్పుడు సూచించిన పెండింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. హాస్టల్ లో కిటికీల మరమ్మతులు, డోర్ల ఫిట్టింగ్, మెష్ అమరిక, గదుల్లో వర్షపు నీటి లీకేజీల నివారణ కోసం పైకప్పు ప్లాస్టింగ్ పనులను పరిశీలించి, ఇంకా మిగిలిన ఉన్న పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లోని కొన్ని టాయిలెట్లు బ్లాక్ అయి వినియోగానికి అనుకూలంగా లేవని గుర్తించి, సంబంధిత ఎస్.ఈ. వెంటనే మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం అందించాల్సిన గుడ్లు,చికెన్ వంటి ఆహార పదార్థాలు క్రమం తప్పకుండా అందడం లేదని విద్యార్థులు తెలియజేయడంతో కలెక్టర్ వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పందం ప్రకారం సరఫరా జరిగేలా చూడాలని, దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. సరఫరాలో



నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను పరిశీలించారు, తరగతి గదులలో గోడలు మరియు పైకప్పుల నుంచి పెచ్చులు ఊడిపోతున్న వాటిని వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గురుకుల కళాశాలలు మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ ,నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా ప్రత్యేక శిక్షణ,అనుభవం కలిగిన లెక్చరర్ డాక్టర్ రాజునునియమించారు. విద్యార్థులు ఉన్నత చదువుల కొరకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ సుధాకర్, యం ఆర్ ఓ, ఎంపిడిఓ నాగవేణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివి మంచి ఉత్తీర్ణులు కావాలి

**ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**ఆలేరు, ఆగస్టు 5 మహా :** ధైర్యం, క్రమశిక్షణ, లక్ష్యసాధనతో విద్యార్థులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం ఆలేరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో దిన శరణ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మరియు కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆరు గ్యారంటీలను ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకువస్తూ వారి



భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. విజయం సాధించాలంటే బకేవలం ప్రతిభ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగితే ఏ రంగంలోనైనా అత్యున్నత విజయాలు సాధించవచ్చని అన్నారు. విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం, సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత కూడా అలవర్చుకోవాలని హితవు పలికారు... అనంతరం ఇటీవల వివిధ పోటీ పరీక్షలు, విద్యా పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించి వారికి ప్రతిభా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిపుణులు విద్యార్థులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలు, కెరీర్ ఎంపికపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ అభిరుచి, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దిన శరణ్య సంస్థ ప్రతినిధులు చింతల సాయిబాబా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్

- **ఎరువులన్ని ఫెర్టిలైజర్ యాప్ తోనే అమ్మకాలు**
- **పట్టాలు కాని రైతులకు ఎన్డీఎస్ క్రింద బుక్ చేసుకోవచ్చు – ఏడీఏ కరుణశ్రీ**

కారేపల్లి, మహా: దేశ వ్యాప్తంగా ఒకే పాలసీ విధానంతో ఎరువుల క్రయ, విక్రయాలు జరగాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం నూతనంగా ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర యాఫ్ నుతీసుక వచ్చిందని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. బుధవారం కారేపల్లిలోని ఎరువుల దుకాణాలు, సోసైటీ సేల్ పాయింట్లను ఏడీఏ తనిఖీలు చేశారు. ఈసందర్బంగా రైతులనుద్దేశించి ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయశాఖ రుపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాఫ్ ద్వారా యూరియా అమ్మకాలనుసాగిస్తుండగా దాని విస్తృత పరచాలని ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం దీనినిస్పూర్తిగా తీసుకోని దేశ వ్యాప్తంగా అమలు చేయటానికి నూతనంగా ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాఫ్ ను తీసుకవచ్చిందన్నారు. 6వ తేది నుండి అన్ని ఎరువులు ఆదే యాఫ్ ద్వారా అమ్మకాలు సాగుతాయన్నారు. రైతులు ఈ యాప్ ను ఇన్ స్టాల్ చేసుకోని ఆధార్ కార్డు లేదా ఫార్మర్ ఐడీ ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుందన్నారు. భూమి ఉండి పట్టా కాని వారు, కౌలు దారులు, నాన్ డిజిటల్ సిగ్నేషర్(ఎన్డీఎస్) క్రింద పోన్ నెంబర్ తో లాగిన్ అవ్వాలన్నారు.



యాప్ లోకి వెళ్లిన తర్వాత యాఫ్ లో ఉన్నరైతు భూమి వివరాలకు సంబంధించి పంట వివరాలు నమోదు చేయాల్సి ఉంటుదన్నారు. నాన్ డీఎస్ రైతులు భూమి సర్వే నెంబర్లు, భూ విస్తీరణం యాడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీని తర్వాత జీఎఫ్ఆర్ విధానంలో ఎరువులు నిర్ణయించటం జరుగుతుందన్నారు. దానికి మించి కావల్సినావారు ఎరువులమోతాదును పెంచుకొనికొనుగోలు చేయవచ్చన్నారు. దీని ద్వారా జనరేట్ అయిన బుకింగ్ ఐడి లేదా క్యూర్ ఆర్ కోడ్ తీసుకోని ఎరువుల దుకాణాలను సంప్రదించి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఎరువు డీలర్లకు ప్రత్యేకంగా యాఫ్ లేదని పాయింట్ అఫ్ సేల్ (పీవోఎస్)మిషన్ లోనే క్యూఆర్ కోడ్ రీడర్, ఐడి నమోదు ఉంటుందని దాని ద్వారా రైతు వివరాలు బుక్ చేసుకున్న ఎరువులవివరాలు వస్తాయన్నారు. పీవోఎస్ లోనమోదు చేసిరైతులకు ఎరువులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యాప్ పై అవగాహనకు వాలంటీర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. దీనిపై వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లకు శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, డైరక్టర్లు అడ్డగోఐ ఐలయ్య, సోసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఏఈవో బీ.నరేష్. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బానోత్ రాంమ్మూర్తి, మండల అధ్యక్షులుతోటకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## రక్తమైసమ్మకు వెండి కిరీటం సమర్పణ

**మొయినాబాద్, మహా:** అమాడపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బూర్గురవళి గోపికృష్ణారెడ్డి బోనాల ఉత్సవాల సందర్భంగా శ్రీ రక్తమైసమ్మ అమ్మవారికి రూ.8.54 లక్షల విలువైన వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయాలు గ్రామాల్లో ప్రజలకు మానసిక ప్రశాంతతను అందిస్తాయని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ వెండి కిరీటం సమర్పించే అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు.



# 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా సైబర్ అవగాహన కార్యక్రమం

**క్లిక్ చేసే ముందు ఆలోచించండి – ఆగండి, పరిశీలించండి, సురక్షితంగా ఉండండి**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 5 మహా:** సురక్షా కా తిరంగా కార్యక్రమంలో భాగంగా భువనగిరి డి.ఎస్.పి రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులచే భువనగిరి పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై సైబర్ భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత మరియు ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైబర్ & ఫోరెన్సిక్ నిపుణులు సందీప్ ముదల్కర్ అత్యంత సమగ్రంగా మరియు ఆసక్తికరంగా పి పి టి ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల తీరుతెన్నులు, సైబర్ నేరగాళ్లు ఉపయోగించే పద్ధతులు మరియు వాటి నుంచి రక్షించుకునే మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లైవ్ డెమోస్ మరియు ప్రాక్టికల్ ప్రయోగాలు నిర్వహించడం ద్వారా సైబర్ మోసాలు వాస్తవ జీవితంలో ఎలా జరుగుతున్నాయో విద్యార్థులు మరియు పట్టణ ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ ప్రత్యక్ష ప్రదర్శనలు పాల్గొన్న వారిలో సైబర్ నేరాలపై మరింత అవగాహన కల్పించాయి. ఓటిపి మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ కాల్స్, సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఓటిపి లు, పాస్‌వర్డ్‌లు, పిన్ లు, బ్యాంకింగ్ వివరాలు మరియు వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అనుమానాస్పద లింకులు,



మెసేజ్ లు లేదా కాల్స్ వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా వాటి నిజానిజాలను పరిశీలించాలని, తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన అవగాహన వీడియోలు మరియు పి పి టి ప్రజెంటేషన్ విద్యార్థులు మరియు ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడానికి, భవిష్యత్తులో సైబర్ నేరాల బారిన పడకుండా తమను తాము రక్షించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. సైబర్ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని యాదాద్రి భువనగిరి పోలీసులు సూచించారు. సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు యాదాద్రి భువనగిరి పోలీసులు నిరంతరం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సైబర్ సురక్షిత సమాజం నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇత ర పోలీసు అధికారులు , సిబ్బంది, అలాగే భువనగిరి పట్టణానికి చెందిన విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నానో యూరియా, నానో డీఏపీ సమర్థతపై క్షేత్ర స్థాయి పరిశీలన

- **బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహణ**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో కన్నెపల్లి మండలంలోని జంకాపూర్ మరియు పోలంపల్లి గ్రామాలలో వరి, పత్తి పంటల్లో నానో యూరియా మరియు నానో డీఏపీ సమర్థత అంచనాపై క్షేత్ర స్థాయిలో బుధవారం నాడు పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నానో ఎరువుల వినియోగం ద్వారా పోషక వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, పంట ఎదుగుదల మరియు దిగుబడిని మెరుగుపరచడం వంటి అంశాలను రైతులకు వివరించారు.వరి పంటలో నాట్లు నాటే ముందు నానో డీఏపీతో వేర్ల ముంపు విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. పత్తి పంటలో సిఫారసు చేసిన షెడ్యూల్ ప్రకారం నానో యూరియా మరియు నానో డీఏపీ ఆకులపై పిచికారీ చేసే విధానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో చూపించారు.ఈ సందర్భంగా నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం, సమతుల్య పోషక నిర్వహణ పాటించడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తి సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో డా. ఎన్. మహేష్, సీనియర్ శాస్త్రవేత్త & అధిపతి, కేవీకే బెల్లంపల్లి పి. సాద్వి, ఎస్ఎంఎస్ (ఎక్స్‌టెన్షన్), కేవీకే బెల్లంపల్లి, వ్యవసాయ అధికారి ప్రశాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## 28వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాల జోరు

# కథనంపై స్థానికుల అనూహ్య స్పందన

- **మహా కథనం పై ఆరా తీస్తున్న కమీషనర్, కదిలిన టౌన్ ప్లానింగ్**
- **మాజీ నాయకుడి పై వెల్లువెత్తుతున్న విమర్శలు**
- **సమయం ఇవ్వండి రుజువులు ఇస్తాం అన్న స్థానిక ప్రజలు, నాయకులు**

**వరంగల్, బ్యూరో మహా ;**వరంగల్ నగరంలోని 28వ డివిజన్ లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాల పై "మహా పత్రిక" సంస్థ బుధవారం ప్రచురించిన ప్రత్యేక కథనం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఐదేళ్లుగా భయంతో మాట్లాడ లేకపోయిన స్థానిక ప్రజలు, నాయకులు ఇప్పుడు గళమెత్తారు. మహా కథనానికి స్పందించిన స్థానిక ప్రజలు, నాయకులు28వ డివిజన్ లో జోరుగా అక్రమ నిర్మాణాలు అనే శీర్షికతో వచ్చిన కథనం చదివిన వెంటనే 28వ డివిజన్ లోని బాధిత ప్రజలు, ఇతర నాయకులు మహా ప్రతినిధికి ఫోన్లు చేసి అంశం పై స్పందించారు.స్థానికంగా ఉన్న ఓ ఫిర్యాదు దారుడు ఒకరు సార్ 15 నుండి 20 ఫీట్ల గల్లీలో కనీసం అంబులెన్స్ కూడా తిరగలేని ఇరుకైన గల్లీ ల్లో నాయకుడి అండతో అనుమతుల తో సంబంధం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్ 4, అంతస్తులు కడుతున్నారు అని చెప్పాడు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే మేమంతా చావాల్సిందేనని భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. కొన్నిసార్లు కంప్లైంట్ చేస్తున్నాం, చేసిన పక్కవారి గొడవలు ఏ గొడవలతో మాకు సంబంధం లేనట్టుగా ఫిర్యాదులను ఎవరూ పట్టించుకోలేదు. కానీ మా బాధలను మీరు రాసినందుకు ధన్యవాదాలు" అని ఆవేదన వ్యక్తం చేశారు.మరో స్థానికుడు మేము చట్టం, నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకుని లక్షలు ఫీజు కూడా కట్టాము కానీ స్థానిక మాజీ నాయకుడు మాత్రం పదవులు ఉన్నప్పుడు లేనప్పుడు కూడా సిబ్బంది తో కుమ్మక్కై పదవి రాజకీయ అండతో కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఇది ఇంతవరకు న్యాయమని?" అని ప్రశ్నించారు.

**స్థానిక సీనియర్ నాయకులు**

బల్దియా లోని సంబంధిత అధికారులు, సిబ్బంది తో మాజీ నాయకుడి తోపాటు కొందరు నాయకులు కుమ్మక్కై మేమున్నాం అని నాకు అన్ని విధాలుగా సపోర్ట్ ఉంది అని కొంతమంది యజమానులను తప్పుదోవ పట్టిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మాకు కాస్త సమయం ఇస్తే సాక్ష్యాధారాలతో నిరూపిస్తామని వారు బహిరంగంగా సవాల్ విసురుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్లు, కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేస్తున్నారు.

**నాయకుడి వసూళ్ల బాగోతాల పై పక్కా రుజువులు అందిస్తాం**

కథనంలో ప్రస్తావించిన తాజా, మాజీ నాయకుడి వసూళ్ల హవా" అంశం పై వివిధ పార్టీల స్థానిక నాయకులతో పాటు స్థానికులు మరింత ఘాటుగా స్పందించారు.డివిజన్ లోని కొందరు బాధితులు, బిల్డర్లు స్వయంగా మహా ప్రతినిధిని సంప్రదించి కాస్త సమయం ఇవ్వండి మా దగ్గర కొన్ని రుజువులు ఉన్నాయి సార్" అని హామీ ఇచ్చారు. మరి కొంతమంది బాధితులు సార్ మీరు కథనం రాసి మాకు ధైర్యం ఇచ్చారు. ఇప్పుడు మేము వెనక్కి తగ్గం. అన్ని రుజువుల తో కమిషనర్ కు కలెక్టర్ల కు ఫిర్యాదు చేస్తాం. మీరు మాతో ఉండండి" అని మహా ప్రతినిధిని బాధితులు కోరారు.ఇక ముందు నిబంధనల మేరకు ఇల్లు కట్టుకుంటే సిబ్బందికి అలాగే ఏ రాజకీయ నాయకులకు ఎటువంటి డబ్బులు ఇవ్వబోమని వారు ఖరాఖండిగా చెబుతున్నారు.

**అధికారుల పై ఒత్తిడి**

కథనం ప్రభావంతో బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగం అలర్ట్ అయింది. 28వ డివిజన్ లో సర్వే చేస్తామని, అక్రమ నిర్మాణాల పై నోటీసులు ఇస్తామని అధికారులు చెప్తున్నారు. అయితే స్థానికులు మాత్రం నోటీసులతో సరిపెట్టొద్దు కూల్చివేతకు ప్రాధాన్యమిస్తేనే ఇకముందు అక్రమ నిర్మాణాలు జరగకుండా ఉంటాయని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ దుమారం ఈ అంశం పై అధికార, ప్రతిపక్ష నాయకులు కూడా రంగంలోకి దిగారు. "అక్రమ వసూళ్లకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం" అని హెచ్చరిస్తున్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

- **అందుకు తగిన ఏర్పాట్లకు శ్రీకారం చుట్టండి**
- **సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని అందుకు తగిన ఏర్పాట్లకు శ్రీకారం చుట్టండి అంటూ అధికారులకు సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్ సూచించారు. సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు ఈనెల 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ సెంట్రల్ వేడుకల నిర్వహణ మరియు ఏర్పాట్ల పై బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ ఛాంబర్ నందు జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ సివిల్ ఈ అండ్ఎం ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ మెడికల్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ సెంట్రల్ వేడుకలు జరుపుకొనుటకు కావలసిన ఏర్పాట్లును చేయాలని సంబంధిత కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ సివిల్ ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ మెడికల్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణంలోని వివిధ విద్యార్థులు చేసే కవాతు వందనం, మార్చ్ ఫాస్ట్ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వేడుకలలో పాల్గొనే ఉత్తమ ఉద్యోగులు సింగరేణీయులు వారి కుటుంబ సభ్యులకు, పరిసర ప్రాంత ప్రజలు అధికసంఖ్యలో పాల్గొంటారని వారికి ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని విజయవంతంచేయాలని అధికారులకు దిశానిర్దేశంచేసి తగిన సూచనలు సలహాలుఇచ్చారు. అదేవిధంగా హెడ్ఆఫీస్ ను విద్యుత్ దీపాలతో అలంకరించాలని అందుకు అవసరమయిన అన్ని ఏర్పాట్లను చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిఎం(ఈ అండ్ ఎం) ట్రాన్స్పోర్ట్ ఎం.రామనాధం, జిఎం(ఈ అండ్ ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కే.రామ మోహన్, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(పర్సనల్)లు బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, డివై.సిఎంఓ ఎం.ఉషా, డిజిఎం(ఈ అండ్ ఎం) ట్రాన్స్పోర్ట్ బి.సీతారాం, డిజిఎం(ఫైనాన్స్) సిహెచ్.రమేష్, ఎస్ఈ(సివిల్) పి.రాజేంద్ర ప్రసాద్, డివైపిఎంలు కే.శివ కుమార్, కే.సునీల్ కుమార్, వి.దేవేందర్ రెడ్డి, డివై.ఎస్ఈ(ఈ అండ్ ఎం) ఏ.నరేష్ బాబు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ యండి.జాకీర్ హుస్సేన్, మేనేజర్ ఫారెస్ట్రి పిబి.డేవిడ్ అభిలాష్ సీనియర్ పిఓ మండల శ్రీనివాస్, వెల్ఫేర్ పిఏ వర ప్రసాద్, ఇతరఅధికారులు పర్సనల్ ఇబ్బంది పాల్గొన్నారు.

# బీజెపి వల్లనే సింగరేణికి మహర్దశ వస్తుంది

**ఆర్.కే.-7 గని పై భారత ప్రధాని క్షీరాభిషేకం**

**మంచిర్యాల, మహా :** భారతీయ జనతా పార్టీ (బీజెపి) వల్లనే సింగరేణికి మహర్దశ వస్తుందని బీజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ ఎరబెల్లి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ లు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియా ఆర్.కే.7 గని పై భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఎలాంటి వేలం లేకుండా మణుగూరు పీ.కే.ఓ.సి.2 డిప్ సైడ్ బ్లాక్ కేటాయించినందని వారు కొనియాడారు. సింగరేణి సంస్థ ఆర్థికంగా బలపడటానికి నైని కోల్ బ్లాక్, తాడిచర్ల2 కోల్ బ్లాక్,



పీ.కే.ఓ.సి.2 కోల్ బ్లాక్ సింగరేణికి కేటాయించడం హర్షణీయం అని హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి కాలరీస్ కంపెనీ బొగ్గు పరిశ్రమకు మూడు బ్లాక్ లకు కేటాయింపుకు కృషి చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగప బి ఎం ఎస్ నేతలు పాల్గొన్నారు.




# సమాజ సేవలో ముందుండాలి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** సమాజ అభివృద్ధికి సేవా సంస్థలు ఐక్యంగా పనిచేస్తూ ఆదర్శంగా నిలవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా పద్మశాలి టౌన్‌షిప్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ పార్క్‌లో బుధవారం నిర్వహించిన శ్రీ భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు దీప ఏములు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సేవాభావం, పరస్పర సహకారం, ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ప్రజల సంక్షేమానికి ఉద్దేశించిన ప్రతి మంచి కార్యక్రమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బండారు లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు. సింగిరెడ్డి. సోమశేఖర్ రెడ్డి, మాట్లాడుతూ కాలనీల అసోసియేషన్లు అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. పద్మశాలి టౌన్షిప్ కోపరేటివ్ చైర్మన్ సీతా ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశాలి టౌన్షిప్ లో మరింత రోజురోజుకు అభివృద్ధి అవుతుందని రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉండాలని సీత ఆంజనేయులు సూచించారు మాజీ కార్పొరేటర్లు . కొత్త రామారావు . సాయిజన్ శేఖర్, పాజ్జురి పావని మహిపాల్ రెడ్డి, డా ఏఎస్ రావు నగర్ డివిజన్ బీజేపీ నాయకుడు కనుకుల రజినీకాంత్ రెడ్డి, రేగళ్ల.సతీశ్ రెడ్డి దమ్మైగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు రామారావు మాది వార్డ్ కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరి గౌడ్ ఇతర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. నూతనంగా గెలుపొందిన పద్మశాలి టౌన్షిప్ అసోసియేషన్ నేతలు ప్రమాణ స్వీకారం చేశారు.

# పట్నం మున్సిపాలిటీలో మహిళా కౌన్సిలర్‌కు అవమానం: బీజేపీ

చైర్మన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన
మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 5 మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సర్వసభ సమావేశంలో మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన అవమానకర ఘటనపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల రెండో తారీఖున జరిగిన సర్వసభ సమావేశంలో కౌన్సిలర్ భానుప్రియ తన వార్డుకు నిధులు కేటాయించడం లేదని ప్రతిపాదనను తిరస్కరించారని నేలపై కూర్చొని నిరసన తెలిపిన క్రమంలో, మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, మహిళా కౌన్సిలర్ ను సమావేశంలో కించపరిచే విధంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చైర్మన్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నాయిని సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా కౌన్సిలర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత మున్సిపల్ చైర్మన్ పై ఉందని, వారిని కించపరచడం ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వార్డు అభివృద్ధి నిధుల కేటాయింపులో కూడా వివక్ష చూపుతున్నారని ఆరోపించిన ఆయన, ప్రజాప్రతినిధులందరికీ సమాన అవకాశాలు కల్పించి, అన్ని వార్డుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అధికార పార్టీకి చెందిన వార్డులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ, ప్రతిపక్ష కౌన్సిలర్లను నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.మహిళా కౌన్సిలర్ భానుప్రియ మాట్లాడుతూ... తనపై జరిగిన వ్యవహారం వ్యక్తిగత అవమానం మాత్రమే కాదని, ప్రజలు ఇచ్చిన ప్రజాప్రతినిధి హోదాకు జరిగిన అవమానమని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా ప్రజా సమస్యలు ప్రస్తావించే పరిస్థితి ఉండాలని, బెదిరింపులు లేదా అవమానాలు సహించబోమని స్పష్టం చేశారు.నిరసన అనంతరం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా కౌన్సిలర్‌ను అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, చైర్మన్ సుదర్శన్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వార్డు అభివృద్ధి నిధుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ అన్ని వార్డులకు సమాన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు, కౌన్సిలర్లు మరియు పలువురు ప్రజలు పాల్గొని మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవం కల్పించాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై త్వరలో తగిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.



## ఎలిమినేడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు షూ పంపిణీ!

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 5 మహా:** ఎలిమినేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్, సిఐ షూ పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం, ఎలిమినేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం అందించిన షూలను, సర్పంచ్ మంద యాదమ్మ, సిఐ మహేందర్ రెడ్డి, విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాలీ ఆటో రిపేర్ విషయంలో ఘర్షణ

- **ఆటో డ్రైవర్ పై దాడి చేసిన గ్యారేజ్ మెకానిక్లు..**
- **పలువురికి తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు.**



**రాజేంద్రనగర్ మహా ;** ట్రాలీ ఆటో రిపేర్ విషయంలో మెకానిక్ ఆటో డ్రైవర్ మధ్య వాగ్వాదం జరిగి మాట మాట పెరగడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటన శంషాబాద్ లో కలకలం రేపింది. శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ రెవెన్యూలో ఆటో మెకానిక్ షాప్ ఉంది( వెల్డింగ్) మహేష్ యాదవ్ కు చెందిన అశోక్ లీలాండ్ ఆటో ట్రాలీ మరమ్మత్తుల కోసం నర్కూడ ( గ్యారేజ్ కి) దుకాణానికి వచ్చారు.ఒకనెలలో మూడుసార్లు రిపేరుకు రావడం ఏమిటని ఆటో డ్రైవర్ శివ ఎందుకు రిపేరు వస్తుందని సదరు మెకానిక్లను ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య మాట మాట పెరిగి ఆటో డ్రైవర్ శివ పై విచక్షణ రైతంగా గ్యారేజ్ లో ఉన్న మెకానికులు దాడికి దిగారు. మెకానిక్లు దాడి పాల్పడడంతో ఆటో యజమాని అయిన మహేష్‌కు డ్రైవర్ సమాచారం చేరవేశాడు. మహేష్ గౌడ్ తన డ్రైవర్ పై ఎందుకు దాడి చేశారని వారిని ప్రశ్నించగా ఎలాంటి సమాధానం చెప్పకుండా మహేష్ తో పాటు అతని వెంట వచ్చిన వారిపై ఇనుప రాడ్లు ఇటుకలతో దాడి చేశారు. దాడిలో పెద్ద షాపూర్ గ్రామానికి చెందిన దాదాపు పది మందికి తలలు, వీపులు , చేతులకు రక్త గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా రోడ్డుపై వచ్చి ఎందుకు గొడవ పడుతున్నారని అడిగిన వారిని సైతం మెకానికులు విచక్షణ రహితంగా రోడ్డుపై పరిగెత్తించి దాడి చేశారు. స్థానికులు కొంతమంది దాడిని ఆపే ప్రయత్నం చేసిన వారిపై సైతం దాడి చేశారు. దీంతో గాయాల పాలైన పెద్ద షాపూర్ వాసులు వారి స్నేహితులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న మెకానికులు మరోసారి వచ్చిన వారిని గ్యారేజీలో లోపల బయట దాడికి దిగడంతో ఇరువురు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఇరువర్గాలు దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. శంషాబాద్ సీఐ సురేందర్ రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను అక్కడినుంచి పంపించి వేశారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పెద్ద షాపూర్ గ్రామానికి చెందిన 9 మంది శంషాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువార్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# కాప్రా చెరువును సుందరీకరణగా తీర్చడమే నా లక్ష్యం

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ,. మహా:** కాప్రా చెరువులో హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతున్న సుందరీకరణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుందరీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, చెరువు పరిసరాలను ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కోరారు. కాప్రా చెరువు సుందరీకరణ పూర్తయితే స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా తోడ్పడుతుందన్నారు. చెరువు పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా అవసరమైన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాసం మైపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ విద్యాలయాలే ప్రగతికి గీటురాళ్లు

- **శారదాంబ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు గంగాధరరావు**

**కుషాయిగూడ, మహా :** ప్రభుత్వ విద్యాలయాలే ప్రగతికి గీటు రాళ్లు అని శారదాంబ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు గంగాధర్ రావు పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థులకు బుధవారం స్కూలు బ్యాగులు స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాలు ప్రతిభావంతులకు వేదికలని విద్యార్థులు విద్యతోపాటు విద్యేతర కార్యక్రమాల్లో ముందు ఉండడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రతిభలో అంతర్జాతీయ స్థాయిలో రాణించగలుగుతున్నారంటే కారణం ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల పట్టుదలయే అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మరెన్నో కీర్తి కిరీటాలను అధిరోహించి పాఠశాలకు తద్వారా జవహర్ నగర్ కే కాకుండా దేశానికి పేరు తేవాలని సూచించారు. అనంతరం ఆరో తరగతి చదువుతున్న 54 మంది విద్యార్థులకు ఉచితంగా పాఠశాల బ్యాగులు నోటుబుక్స్ స్టేషనరీ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి సంఘం కోశాధికారి సిహెచ్ భానుమూర్తి, ఏ. రామ్మోహన్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రాజేందర్, పెంచలయ్య, ఉషారాణి ,మేరీ లావణ్య కోమలి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరాడంబరంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని జన్మదిన వేడుకలు

- **శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు, పలువురు నేతలు, నాయకులు, కార్యకర్తలు**



**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ నన్నపునేని నరేందర్ జన్మదినం సందర్భంగా వారి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యమ నేత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందడం వల్ల ఎటువంటి వేడుకలను, కేక్ కటింగ్ లు నిర్వహించవద్దని వరంగల్ తూర్పు నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు నన్నపునేని నరేందర్ ముందస్తుగానే పిలుపునిచ్చారు.బుధవారం ఉదయం నన్నపునేని నరేందర్ కార్యకర్తల తో కలిసి బట్టల బజారు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, శ్రీ భద్రకాళి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తమ ప్రియతమ నాయకుడు నరేందర్ సంపూర్ణ ఆయురారోగ్యాలు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు .ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, మాజీ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నరేందర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# కాప్రా నాచారం సర్కిల్ కార్యాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

- **అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ కమిషనర్లు రవీంద్ర సాగర్, నిత్యానందన్**

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా, నాచారం సర్కిల్ కార్యాలయాల్లో ఆషాఢమాస బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీంద్ర సాగర్, నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానందన్ ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్లు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో బోనమెత్తి అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో బోనాలు సమర్పించారు. పోతరాజులు గజ్జెలు కట్టి వీరగోలలతో భక్తి గీతాలకు నృత్యాలు చేస్తూ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, పారిశుధ్య తదితర విభాగాల ఉద్యోగులు డప్పు చప్పుళ్లు, భజన బృందాల నడుమ అమ్మవారి పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కళ్యాణి రాణి, సెక్షన్ ఆఫీసర్లు తుల్జా సింగ్, చైన్ మాన్ శ్రీధర్, రాజు కుమార్, రాజు, రమేష్, గిరి, ఎల్లయ్య, నరేష్, శివాజీతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# బీపీసీఎల్ కార్మికుల సమస్య పరిష్కారానికి . మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవ

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లిలోని బీపీసీఎల్ కేంద్రంలో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల ఉపాధి సమస్య పరిష్కారానికి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేకమైన చొరవ చూపారు . బుధవారం బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ లు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి సంబంధిత శాఖ అధికారులకు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.బీపీసీఎల్ ఎంప్లాయిస్ తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కార్మికులు గత మూడు సంవత్సరాలుగా టెండర్లు లేకుండానే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను నియమించడం వల్ల స్థానికంగా 30 ఏళ్లుగా సేవలందిస్తున్న వారికి ఉపాధి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇటీవల రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు.



# కాప్రా–మల్లాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- **మున్సిపల్ కార్పొరేషన్ కోరిన పరమేశ్వర్‌రెడ్డి**

**కుషాయిగూడ, మహా :** కాప్రా, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, పరిపాలనా అనుమతులు ఇవ్వాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు.బుధవారం కాలనీవాసులతో కలిసి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాప్రా, మల్లాపూర్ ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పునర్నిర్మాణం, సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణం, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనులు పూర్తయితే రహదారి అనుసంధానం మెరుగుపడటంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వినతిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విట్టల్ నాయక్, కాంగ్రెస్ నాయకులు కాకుంట్ల ప్రకాశ్‌రెడ్డి, కాసుల పోచయ్య గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీహరి, టిల్లు యాదవ్, మారులి, కోబారి నాగశేషు, జెమిలా బేగం, కప్పర సాయి కిరణ్ గౌడ్, నెమలి అనిల్‌తో పాటు పలువురు నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాలి

- **ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి విద్యార్థినుల తో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో రాజ్యాంగం లోని నాలుగో స్థంభం గా భావించే జర్నలిజం ప్రాముఖ్యత పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థినుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి సౌకర్యాలు, ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం పై కూడా దృష్టి సారించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు, కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకొని స్వీయ చైతన్యంతో ముందుకు సాగాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కోసం ప్రతి రోజూ వార్తాపత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలని, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వంట సామాగ్రి నిల్వలు పరిశీలించారు. వర్షాకాలం జాగ్రత్తగా శుభ్రత పరిశుభ్రత పాటించాలని వార్డెన్ ను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. పిల్లలతో ముచ్చటించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డిబీసీడీఓ పుష్పలత, డి టి డి ఓ నారాయణరెడ్డి, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్లామర్, ఫిట్‌నెస్‌కు కేరాఫ్ సాక్షి మాలిక్

స్టైలిష్ లుక్‌తో ఎప్పటికప్పుడు అభిమానులను ఆకట్టుకునే సాక్షి మాలిక్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుపు రంగు క్రాప్ టాప్‌పై ఓవర్‌సైజ్ బ్లూ డెనిమ్ జాకెట్, దానికి మ్యాచింగ్ డెనిమ్ జీన్స్, బంగారు ఆభరణాలతో ఆమె కనిపించిన ఈ అవుట్‌డోర్ ఫోటో సోషల్ మీడియాలో విశేషంగా వైరల్ అవుతోంది. గాలికి ఎగురుతున్న అలలలాంటి జుట్టు, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించే చూపు, స్టేడియం నేపథ్యం కలిసి ఈ ఫోటోకు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. ఫిట్‌నెస్, ఫ్యాషన్, గ్లామర్‌ను సమపాళ్లలో మేళవించే ఆమె వ్యక్తిత్వాన్ని ఈ ఫోటో అందంగా ప్రతిబింబిస్తోంది.ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో 1993 జనవరి 21న జన్మించిన సాక్షి మాలిక్, నోయిడాలోని జేపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి బీటెక్ పట్టా పొందింది. విద్య పూర్తి చేసిన అనంతరం మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి తన అందం, ప్రతిభతో అనేక ప్రముఖ ప్రకటనల్లో నటించింది. నైకా, పీసీ జువెల్లర్ వంటి ప్రముఖ బ్రాండ్‌ల ప్రకటనల్లో కనిపించి మంచి గుర్తింపు సంపాదించిన ఆమె, అనంతరం తన కెరీర్‌ను విస్తరించేందుకు ముంబైకి వెళ్లింది.2018లో విడుదలైన సోను కె టిటు కి స్వీటీ చిత్రంలోని బోమ్ డిగ్గీ డిగ్గీ పాటలో ప్రత్యేకంగా కనిపించిన సాక్షి మాలిక్ ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఆ పాట భారీ విజయాన్ని సాధించడంతో ఆమెకు విపరీతమైన అభిమాన వర్గం ఏర్పడింది. ఆ తర్వాత అర్మాన్ మాలిక్ పాడిన వెహమ్ మ్యూజిక్ వీడియోలో నటించి మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ప్రతిభను చాటుకుంది.సాక్షి మాలిక్ ప్రస్తుతం ప్రధానంగా ఫిట్‌నెస్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ రంగాల్లో ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కొనసాగుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది అభిమానులను కలిగి ఉన్న ఆమె తరచూ ఫిట్‌నెస్ చిట్కాలు, ఫ్యాషన్ ఫోటోషూట్లు, ట్రావెల్ కంటెంట్, బ్రాండ్ ప్రమోషన్లను పంచుకుంటూ ప్రేక్షకులతో అనుబంధాన్ని కొనసాగిస్తోంది. వివిధ ప్రముఖ బ్రాండ్‌లతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ మోడల్‌గా తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది.అలాగే ఎంపిక చేసిన నటనా అవకాశాలను మాత్రమే స్వీకరిస్తూ డిజిటల్ వేదికల్లో కూడా తన ఉనికిని చాటుకుంటోంది. 2026 మధ్యకాలం వరకు ఆమె నటిస్తున్న పెద్ద సినిమాలపై అధికారిక ప్రకటనలు వెలువడకపోయినా, మోడలింగ్, బ్రాండ్ ప్రచారాలు, వినోద రంగానికి సంబంధించిన పలు ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. తన గ్లామర్, ఫిట్‌నెస్, స్టైలిష్ వ్యక్తిత్వంతో యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ సోషల్ మీడియా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది.



## జాతీయ అవార్డుల ఎంపికపై ఖుష్బూ వ్యాఖ్యలు



ధనుష్ నటించి, దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రానికి ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ చలనచిత్ర పురస్కారం లభించిన నేపథ్యంలో సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. జాతీయ అవార్డుల ఎంపికలో జ్యూరీ అనుసరించే ప్రమాణాలపై తనకు కొన్ని సందేహాలు ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.ఒక చిత్రాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపిక చేసే సమయంలో ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారో స్పష్టత ఉండాలని ఖుష్బూ పేర్కొన్నారు. వివిధ భాషల్లో రూపొందుతున్న సినిమాల నాణ్యతను సమానంగా పరిశీలించడం అవసరమని ఆమె అభిప్రాపడ్డారు.

ప్రత్యేకంగా ఒడియా వంటి చిన్న ప్రాంతీయ చిత్ర పరిశ్రమల్లో కూడా మంచి కథలు, ప్రతిభావంతమైన నటీనటులతో కూడిన సినిమాలు రూపొందుతున్నాయని, అలాంటి చిత్రాలకు జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు దక్కడం లేదనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతీయ భాషా చిత్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఖుష్బూ వ్యాఖ్యలు వెలువడిన తర్వాత సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె అభిప్రాయాన్ని సమర్థిస్తూ చిన్న చిత్ర పరిశ్రమలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అంటుండగా, మరికొందరు జాతీయ అవార్డుల జ్యూరీ నిర్ణయాలను సమర్థిస్తున్నారు. 'రాయన్' చిత్రానికి వచ్చిన పురస్కారం అర్హత ఆధారంగానే దక్కిందని వారు పేర్కొంటున్నారు.ప్రతి ఏడాది జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రకటన అనంతరం ఎంపిక విధానంపై చర్చలు జరగడం సాధారణమే. ఈసారి ఖుష్బూ చేసిన వ్యాఖ్యలతో చిన్న ప్రాంతీయ చిత్రాలకు గుర్తింపు, అవార్డుల ఎంపికలో పారదర్శకత వంటి అంశాలు మరోసారి సినీ పరిశ్రమలో ప్రధాన చర్చగా మారాయి.

## ఆర్జీవీ గురించి జేడీ చక్రవర్తి ఆసక్తికర వ్యాఖ్యలు



నటుడు, దర్శకుడు జేడీ చక్రవర్తి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో కలిసి పనిచేసిన రోజుల జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆర్జీవీతో పాటు దర్శకుడు పూరీ జగన్నాథ్ గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ, ఇద్దరిలోనూ ప్రత్యేకమైన ఆలోచనా విధానం కనిపిస్తుందని అన్నారు. వారు తెలియకుండానే జీవితానికి సంబంధించిన లోతైన విషయాలను చెబుతారని, వారితో మాట్లాడితే కొత్త కోణాలు తెలుస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మను ఒకసారి సరదాగా అడిగిన ప్రశ్నను జేడీ గుర్తు చేసుకున్నారు. "మీరు పిచ్చోళ్లను ఎంపిక చేసుకుంటారా? లేక పిచ్చోళ్లే మీ దగ్గరకు వస్తారా?" అని అడిగానని, దానికి వర్మ కూడా తనదైన శైలిలో నవ్వించే సమాధానం ఇచ్చారని చెప్పారు.ఆర్జీవీ వద్ద పనిచేసే వారిలో నిజాయితీ, ధైర్యం, భిన్నంగా ఆలోచించే స్వభావం ఎక్కువగా ఉంటుందని జేడీ అభిప్రాయపడ్డారు. చాలా మంది ఆయన వద్దకు వచ్చినా, చివరికి ప్రత్యేకమైన ఆలోచనా విధానం ఉన్నవారే నిలబడతారని తెలిపారు. 'శివ' సినిమా సమయంలో తాను అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరానని గుర్తు చేసుకున్న జేడీ, అప్పట్లో ఆ బాధ్యతపై తనకు ఉన్న ఊహలు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్ పని ఎంతో కష్టంతో కూడుకున్నదని, సినిమా నిర్మాణంలో ప్రతి దశలో శ్రమ ఎంత అవసరమో అక్కడే తెలుసుకున్నానని వివరించారు. అలాగే 'సత్య' సినిమా గురించి మాట్లాడుతూ, అందులో చిన్న చిన్న పాత్రలు చేసిన పలువురు నటులు తర్వాత సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు పొందారని చెప్పారు. 'దుబాయ్ శీను' చిత్రంలో విలన్‌గా నటించిన వ్యక్తిని ఆ పాత్రకు తానే సూచించానని, అతను ఆ పాత్రకు సరైన ఎంపిక అవుతాడని అప్పుడే భావించినట్లు వెల్లడించారు.జేడీ చక్రవర్తి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, రామ్ గోపాల్ వర్మ సినిమాల ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రతిభావంతుల గురించి మరోసారి చర్చ మొదలైంది.

## చాందిని కామెంట్స్‌తో టాలీవుడ్‌లో చర్చ



తెలుగు సినీ పరిశ్రమలో హీరోయిన్ల భద్రత, క్యాస్టింగ్ కౌచ్ అంశంపై నటి చాందిని చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. చాయ్ బిస్కెట్ నిర్వహించిన "ది ఆడిషన్ షో" కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన చేదు అనుభవాలను బహిరంగంగా పంచుకుని ఒక్కసారిగా కలకలం రేపారు. 2015లో మహేష్ బాబు 'బ్రహ్మోత్సవం' సినిమా షూటింగ్ సమయంలో ఒక ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా అవకాశం ఇస్తామంటూ ఒక వ్యక్తి తన వద్దకు వచ్చాడని చాందిని తెలిపారు.సెట్‌లో తన తల్లి సమక్షంలోనే మాట్లాడిన ఆ వ్యక్తి, ఆ తర్వాత ఫోన్ చేసి "నువ్వు చూడటానికి అంత బాగుండవు, రంగు కూడా లేవు.. నిన్ను బ్రాండ్ అంబాసిడర్‌గా పెట్టాలంటే కన్విన్స్ చేయాలి" అని అన్నాడని చెప్పారు. కొద్ది రోజుల తర్వాత సదరు వ్యక్తి చాందినికి ఫోన్ చేసి, "సినిమా ఇండస్ట్రీలో ఉండాలంటే కమిట్‌మెంట్ ఇవ్వాలి.. నీ కమిట్‌మెంట్ ఏంటో నేను చూడాలి" అంటూ పరోక్షంగా లైంగిక వేధింపులకు దిగాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె దానికి ఒప్పుకోకపోవడంతో, ఆ వ్యక్తి ఆమె తల్లికి ఫోన్ చేసి "మీ అమ్మాయి అసలు చూడటానికి బాగుండదు, ప్రొడ్యూసర్‌ను కన్విన్స్ చేయాలి" అంటూ అసభ్యంగా మాట్లాడాడు. దీంతో ఆగ్రహించిన చాందిని తల్లి, "నువ్వు ఆర్టిస్టుల కోసం చూస్తున్నావా లేక బ్రోకర్ పనులు చేస్తున్నావా? మరోసారి ఫోన్ చేస్తే పోలీసులకు పట్టిస్తాం" అని గట్టిగా హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటన తర్వాత సదరు వ్యక్తి పరిశ్రమలో తనపై తీవ్రమైన దుష్ప్రచారం మొదలుపెట్టాడని చాందిని వెల్లడించారు. "చాందినికి పొగరు ఎక్కువ, ఆమెతో పనిచేయడం చాలా కష్టం, కంఫర్టబుల్‌గా ఉండదు" అని రూమర్లు సృష్టించారని, ఆ నెగెటివ్ ముద్ర ఇప్పటికీ తనపై కొనసాగుతోందని చెప్పారు. అయితే, అడ్డదారుల్లో అవకాశాలు పొంది ఈజీగా ఉండటం కంటే డిఫికల్ట్‌గా ఉండటమే మంచిదని ఆమె ధీటుగా బదులిచ్చారు. 2024లో 'గామి', 'ఏవం', 'మ్యూజిక్ షాప్ మూర్తి' సినిమాల ప్రమోషన్ల సమయంలో హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నప్పుడు, ఒక స్టైలిస్ట్ ద్వారా ఓ ప్రొడ్యూసర్ తన వద్దకు వచ్చారని చాందిని గుర్తుచేసుకున్నారు. ఆ ప్రొడ్యూసర్ "మనం 2015లో ఒక జ్యువెలరీ యాడ్ కోసం మాట్లాడాం" అని గుర్తు చేయగానే... చాందిని వెంటనే స్పందిస్తూ "ఆ రోజు నన్ను పడుకోమని అడిగింది మీరే కదా!" అని ఆయన ముఖం మీదే నేరుగా నిలదీశానని చెప్పారు. ఆ మాట వినగానే ఆయన ముఖం మాడిపోయిందని తెలిపారు. మొదట్లో తాను చాలా సాఫ్ట్‌గా ఉండేదాన్నని, కానీ పరిశ్రమలో ఎదురైన ఇలాంటి సంఘటనల వల్లనే తన రక్షణ కోసం 'డిఫెన్స్ మెకానిజం'గా ఈ రకమైన కఠిన వైఖరిని అలవర్చుకున్నానని చాందిని స్పష్టం చేశారు. నిజాయితీగా పనిచేసే వారితో కలిసి పనిచేస్తానని, తేడాగా ప్రవర్తిస్తే అసలు స్కోప్ ఇవ్వనని ఆమె తేల్చి చెప్పారు. ప్రస్తుతం చాందిని చేసిన ఈ వ్యాఖ్యలు టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034

అలాగే 2023లో విడుదలైన [illegible] చిత్రంలో [illegible]
న్నిబాయి పాత్రలో కనిపించి నటిగా కూడా తన